ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
బుధవారం, 19 మార్చి 2025

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:25 (బుధవారం సాయంత్రం)
సహర్: 4:53 (గురువారం ఉదయం)


ఖమ్మంలోని పాత డీఈవో కార్యాలయం ఆవరణంలో నిర్మిస్తున్న భవనం

నగరాలు, పట్టణాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. జిల్లా కేంద్రాల్లోని ప్రధాన ఆస్పత్రులతో పాటు పట్టణాల్లోని వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రులపై భారం పడకుండా ప్రజలకు ప్రాథమిక వైద్యసేవలు అందించేందుకు ఈ కేంద్రాలను ఏర్పాటుచేశారు. అయితే వీటిలో అన్ని రకాల మందుల లభ్యతతో పాటు, ప్రాథమిక వైద్యసేవలందించే సౌకర్యాలున్నప్పటికీ ఓపీ సేవలు ఆశాజనకంగా ఉండడంలేదు. అస్వస్థతతో రోగం నయం చేసుకోవడానికి వస్తున్న బాధితులకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని బస్తీ ఆస్పత్రులు చుక్కలు చూపిస్తున్నాయి. వివిధ రుగ్మతలతో వచ్చేవారు సమయపాలన పాటించని వైద్యులతో విసిగిపోతున్నారు. దవాఖానాల ప్రాంగణాల్లో గంటల తరబడి వేచిచూస్తున్నారు. పలు చోట్ల పక్కా భవనాలు లేక అద్దె ఇళ్లల్లో ఇరుకు ప్రాంగణాల్లో వైద్యులు పని చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రెండేళ్లుగా అభివృద్ధి నిధులు రాకపోవడంతో రోగులకు కనీస సౌకర్యాలు కల్పించలేకపోతున్నారు. పూర్తిస్థాయిలో ఔషధాలు అందుబాటులో ఉండటం లేదు. వెరసి ప్రభుత్వం పట్టణ వైద్యశాల సుస్తీని వదిలించాల్సి ఉంది.

-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, ఖమ్మం/భద్రాద్రి కొత్తగూడెం


పాత కొత్తగూడెంలోని పట్టణ ఆరోగ్య కేంద్రం

ఆంధ్రజ్యోతి పరిశీలన

బస్తీ వైద్యానికి సుస్తీ..

6

- అద్దె భవనాల్లో అరకొర వైద్యం
- సమయపాలన మరిచిన వైద్యులు
- ఖాళీగా వైద్య సిబ్బంది పోస్టులు
- రెండేళ్లుగా కేంద్రాలకు నిలిచిపోయిన నిధులు
- వసతుల లేమి.. చాలీచాలని మందులు


దాడిలో గాయపడిన ఆర్‌ఎంపీ రంగారావు

ఆర్‌ఎంపీపై మరో ఆర్‌ఎంపీ దాడి

- తన ఏరియాలో వైద్యం చేస్తున్నాడని కోపం
- కాపుకాసి మరో నలుగురితో కలిసి దాడి
- పోలీసుల అదుపులో ఆరుగురు

కామేపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తన ప్రాక్టీస్‌కు అడ్డు వస్తున్నాడనే కోపంతో ఓ ఆర్‌ఎంపీ (గ్రామీణ వైద్యుడు)... నలుగురు వ్యక్తులతో కలిసి మరో ఆర్‌ఎంపీపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో బాధిత ఆర్‌ఎంపీ త్రుటిలో తప్పించుకొని ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ సంఘటన కామేపల్లి మండలం నెమలిపురి గ్రామంలో చోటు చేసుకుంది.

బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సింగరేణి మండలం కొత్త కమలాపురం గ్రామానికి చెందిన వడ్డె రంగారావు అనే ఆర్‌ఎంపీ చుట్టుపక్కల గ్రామాలతోపాటు, నెమలిపురి గ్రామంలో కూడా వైద్యం చేస్తున్నాడు. అయితే నెమలిపురిలో వేముల రాధాకృష్ణ (మిగతా 6వ పేజీలో)

మక్కకు దక్కని 'మద్దతు'


కొణిజర్ల దగ్గర ఆరబోసిన మొక్కజొన్న

పత్తికి ప్రత్యామ్నాయంగా రైతులు సాగు చేసిన మొక్కజొన్నకు మార్కెట్‌లో మద్దతు ధర దక్కడం లేదు. జిల్లాలో రైతులు ఈ ఏడాది గణనీయంగా మొక్కజొన్న సాగు చేసినా పంట కొనుగోళ్లకు ప్రభుత్వం ఇంతవరకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయలేదు. దీంతో ప్రైవేటు మార్కెట్‌లో మొక్కజొన్న ధరలు పతనమవుతున్నాయి. రైతులు దళారుల బారినపడి నష్టపోతున్నారు. పంట చేతికి వస్తున్న తరుణంలో ధర ఒక్కసారిగా పడిపోయింది. ఈ ఏడాది ఇప్పటికే మిర్చి పంటకు సరైన ధర రాక రైతులు నష్టపోయారు. ఖరీఫ్‌లో పత్తి పంట తీవ్రంగా దెబ్బతిన్నది. దీంతో ఆ పంటను మధ్యలోనే దున్నేసి మొక్కజొన్న సాగుచేశారు.

- జిల్లాలో భారీగా విస్తరించిన మొక్కజొన్న సాగు
- పెరిగిన పెట్టుబడులు, తగ్గిన దిగుబడులు
- పంట చేతికొచ్చే తరుణంలో పతనమవుతున్న ధరలు
- కొనుగోళ్లపై దృష్టి పెట్టని మార్క్‌ఫెడ్
- 'ప్రైవేటు'లో విక్రయించి నష్టపోతున్న రైతులు

వైరా/కొణిజర్ల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గతం కంటే నాలుగురెట్లు మొక్కజొన్న సాగు పెరిగింది. పత్తి సాగుతో నష్టపోయిన రైతులు ఇప్పుడు మొక్కజొన్నలపై ఆశలు పెట్టుకోగా మార్కెట్‌లో దాని ధర కూడా పతనమవుతుండడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పక్షం రోజుల క్రితం ప్రైవేటులో కూడా మొక్కజొన్న క్వింటా రూ.2,300నుంచి రూ.2,250వరకు ఉంది. ఇప్పుడు పంట రైతుల చేతికి వస్తున్న తరుణంలో క్వింటా రూ.2100కు తగ్గిపోయింది. భవిష్యత్‌లో ఈ ధర మరింత తగ్గే అవకాశముంది. ప్రభుత్వం తమ దగ్గరున్న గణాంకాల ప్రకారం మొక్కజొన్నల కొనుగోళ్లకు ఇప్పటికే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించాల్సి ఉంది. కానీ ఇంతవరకు కనీస చర్యలు చేపట్టలేదు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటా ఒక్కింటికి రూ.2,225 నిర్ణయించినా ప్రైవేటు వ్యాపారులు దానికంటే తక్కువకే


మొక్కజొన్న కల్లంలో మండుటెండలో రైతుల కాపలా

కొనుగోళ్ల చేస్తున్నారు.

పెరిగిన సాగు.. తగ్గిన దిగుబడి

మొక్కజొన్న బాగా పండితే ఎకరానికి 40 నుంచి 45క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. కానీ ఈ సంవత్సరం సాగు విస్తీర్ణం పెరిగినా దిగుబడి మాత్రం ఎకరానికి 30క్వింటాళ్ల దాటడం లేదని రైతులు వాపోతున్నారు. రెక్కలు ముక్కలు చేసుకొని పంట పండించినా దిగుబడి ఆశించినట్లు రాలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. పండిన కొద్దిపంటను కూడా ప్రభుత్వం కొనే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొణిజర్ల మండలంలో గత ఏడాదితో పోలిస్తే నాలుగింతలు మక్క సాగు పెరిగింది. గత ఏడాది మొత్తం 4,500 ఎకరాల్లో మాత్రమే సాగు చేయగా ఈసారి సుమారు 18వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

ఊసే లేని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు

పంట చేతికొచ్చే తరుణం వచ్చినా ప్రభుత్వం 'మక్క' కొనుగోళ్లపై దృష్టి పెట్టలేదు. మార్క్‌ఫెడ్ ద్వారా ఇప్పటివరకు ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. కేంద్రప్రభుత్వం మొక్కజొన్నకు క్వింటాకు రూ.2,225 మద్దతు ధర ప్రకటించినా ఈ ధర పొందేందుకు ప్రభుత్వం తేమ శాతంతో పాటు అనేక నిబంధనలు విధిస్తుంది. 12శాతం తేమ (మిగతా 6వ పేజీలో)

వరాల జల్లు కురిసేనా!?



- నేటి రాష్ట్ర ఆర్థిక బడ్జెట్‌పై ఎన్నో ఆశలు
- నిధుల కేటాయింపు జరిగితేనే సమస్యలకు మోక్షం
- సీతారామ, సీతమ్మసాగర్ ప్రాజెక్టుల ఎదురుచూపు
- ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కపైనే ఆశలు

ఖమ్మం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయించే నిధులతోనే జిల్లాలో అనేక సమస్యల పరిష్కారం ముడిపడి వుంది. రాష్ట్ర అసెంబ్లీలో బుధవారం ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టబోతున్న బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లా వాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. నిధుల కేటాయింపు ఎంతవరకు ఉటుంది, ఏ సమస్యలకు పరిష్కారం లభించబోతోంది.. అన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో దీర్ఘకాలంగా అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, బ్రిడ్జిలు, కాలువల ఆధునీకరణ పనులు, విద్య, వైద్య శాఖల భవనాలు పలు మౌలిక సదుపాయాలకు నిధులు కేటాయిస్తేనే పనులు సాఫీగా సాగి జిల్లా అభివృద్ధి పరుగులు తీసే అవకాశం ఉంది.

సాగునీటి ప్రాజెక్టులు..

జిల్లాకు సంబంధించి సీతారామ సాగునీటి (మిగతా 6వ పేజీలో)

ఇళ్లల్లో దోచి... శ్మశానాల్లో దాచి..

- అంతర్‌రాష్ట్ర వెరైటీ దొంగ తిరువీధుల సురేందర్ అరెస్టు
- రూ.45 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- 90 చోరీ కేసుల్లో నిందితుడు
- పారిపోయే క్రమంలో సత్తుపల్లిలో కానిస్టేబుల్‌పై దాడి
- వలపన్ని పట్టుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన సీపీ సునీల్‌దత్

సత్తుపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో 90 చోరీ కేసులలో నిందితుడిగా ఉన్న తిరువీధుల సురేందర్‌ను మంగళవారం సత్తుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. సురేందర్ ఈనెల 10వ తేదీన సత్తుపల్లిలో అనుమానాస్పద స్థితిలో తిరుగుతుండగా కానిస్టేబుల్ నరేష్ గమనించి అనుసరించాడు. దీంతో సురేందర్ కత్తితో నరేష్‌పై దాడిచేసి పరారయ్యాడు. అప్పటినుంచి అతడి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తూ మంగళవారం ఎట్టకేలకు పట్టుకున్నారు. సురేందర్ ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా చాత్రాయి మండలం చిత్తాపూర్ వాసి. గత నవంబర్‌లో రాజమండ్రి జైలు నుంచి విడుదలైన తర్వాత సురేందర్ తెలుగు రాష్ట్రాలలో తిరిగి చోరీలు చేయడం మొదలుపెట్టాడు. రాష్ట్రంలో ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 3 నెలల కాలంలో 43 కేసులలో నిందితుడిగా ఉన్నాడు. సురేందర్ గూగుల్ మ్యాప్ ద్వారా ఇళ్లను గుర్తించి చోరీలకు పాల్పడుతుంటాడు. చోరీ అనంతరం శ్మశానవాటికల్లో షెల్టర్ తీసుకోవడంతో పాటు చోరీ సొత్తుకూడా శ్మశానాల్లోనే దాచిపెడతాడు. మంగళవారం అందిన (మిగతా 6వ పేజీలో)


సత్తుపల్లిలో రికవరీ చేసిన సొత్తును చూపిస్తున్న సీపీ సునీల్‌దత్


ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్షం నేతలు

సీతారామ ప్రాజెక్టు జలాలు అందించండి..

- ముఖ్యమంత్రికి అఖిలపక్షం నేతల వినతి

వివరాలు : 6లో


కొత్తగూడెంలోని సీపీఐ కార్యాలయాన్ని సందర్శించిన డి.రాజా

ప్రజల పక్షం వహించే వారికే ఆదరణ

- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లాలో 97 కేంద్రాలు.. 16,788 మంది విద్యార్థులు
- సీసీ కెమెరాల నిఘా
- 6 ఫ్లయింగ్, 97 సిట్టింగ్ స్క్వాడ్లు

ఖమ్మం ఖానాపురం హవేలి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టెన్త్ పరీక్షలు ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 97 పరీక్ష కేంద్రాల్లో 16,788 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రభుత్వ ఆధీనంలో నడిచే 282 పాఠశాలలకు చెందిన 10,204 మంది, 142 ప్రైవేటు పాఠశాలలకు చెందిన 6,584 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మొత్తం 97 పరీక్ష కేంద్రాలలో రెగ్యులర్ విద్యార్థులు 16,417, ప్రైవేటు విద్యార్థులు 371 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. 21న ప్రారంభమయ్యే ఈ పరీక్షలు ఏప్రిల్ 4న ముగియనున్నాయి. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి.

పరీక్ష సమయానికి అనుకూలంగా ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉండేవిధంగా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యాశాఖతో సంబంధం లేని అధికారులను సిట్టింగ్ స్క్వాడ్‌లుగా నియమించారు. కేంద్రాలలో తాగునీరు, వైద్య సదుపాయాలు పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేసి పరీక్షలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థులను పరీక్ష సమయానికి గంట ముందు నుంచే అనుమతిస్తారు. పరీక్ష సమయం దాటిన 5 నిమిషాల వరకు విద్యార్థులను అనుమతిస్తారు. ఆ తరువాత వచ్చిన వారిని అనుమతించరు. కేంద్రాలలోకి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు. అధికారులు, స్క్వాడ్స్ సెల్‌ఫోన్‌లకు సైతం అనుమతి లేదు. పరీక్షల నిర్వహణలో కీలకమైన సీఎస్‌లు, డీవోల విధులు నిర్వహించే అధికారులతోపాటు కస్టోడియన్, రూట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్‌లుగా ఆయా విభాగాల్లో నిపుణులు, సమర్థుల సేవలను వినియోగించేలా కేటాయింపులు చేశారు. 6 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 97 సిట్టింగ్ స్క్వాడ్స్, 97 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 98 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 1595 మందిని ఇన్విజిలేటర్లుగా విధులు కేటాయించారు. ఖమ్మం జిల్లాలో 97 పరీక్షా కేంద్రాల్లో ఏ- కేటగిరీ కేంద్రాలు 61, బి- కేటగిరీ కేంద్రాలు 16, సి- కేటగిరీ కేంద్రాలు 20 ఎంపిక చేశారు. పరీక్షా కేంద్రాల దగ్గరలోని జీరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్లు మూసివేయాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. ఈ ఏడాది విద్యార్థులకు ప్రశ్నపత్రంతోపాటు 24 పేజీల బుక్‌లెట్‌ను ఒకేసారి అందించనున్నారు. దీంతో విద్యార్థులకు కొంత సమయం ఆదా కానున్నది. ఈ బుక్‌లెట్‌లోనే విద్యార్థులు జవాబులు రాయాల్సి ఉంటుంది.



చతికిల పడిన 'సుడా'

- ఎల్‌ఆర్‌ఎస్‌లో నత్తనడక
- మొత్తం దరఖాస్తులు 34,045
- ఇప్పటి వరకు అర్హత పొందినవి 7,997
- చెల్లింపులు జరిగినవి కేవలం 250

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్ ఆదాయ సేకరణలో ఖమ్మం నగర పాలక సంస్థ జెట్ స్పీడ్‌తో దూసుకుపోతుంది. గ్రేటర్ వరంగల్‌తో పోటీ పడుతోంది. గ్రేటర్ వరంగల్‌కు మించిన స్థాయిలో ఖమ్మం నగర పాలక సంస్థలో దరఖాస్తుల (మిగతా 6వ పేజీలో)

బస్తీ వైద్యానికి సుస్తీ



అద్దెభవనంలో నిర్వహిస్తున్న వెంకటేశ్వరనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం



రామవరంలోని పట్టణ ఆరోగ్య కేంద్రం

- అద్దె భవనాల్లో అరకొర వైద్యం
- సమయాన్ని పాటించని వైద్యులు
- ఖాళీగా వైద్య సిబ్బంది పోస్టులు
- రెండేళ్లుగా కేంద్రాలకు నిలిచిపోయిన నిధులు
- వసతుల లేమి.. చాలీచాలని మందులు
- లెప్రసీ సర్వేతో అందుబాటులో లేని సిబ్బంది

ఆంధ్రజ్యోతి పరిశీలన

ఖమ్మంకలెక్టరేట్/ స్పోర్ట్స్/ క్రైం/ వ్యవసాయం/ మధిర/ సత్తుపల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని వెంకటేశ్వర నగర్ యూపీహెచ్‌సీ అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నారు. దీంతో రోగులకు అందాల్సిన సేవల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అద్దె ఇంట్లో నిర్వహిస్తున్న ఈ పీహెచ్‌సీ భవనం వరదలో మునిగిపోవడంతో వర్షాకాలం వచ్చిందంటే ఇటు సిబ్బంది.. అటు ప్రజలు రావాలంటేనే హడలిపోతున్నారు. అత్యవసర సమయంలోనే వైద్య సేవలు అందడం లేదని వాపోతున్నారు. దవాఖానాలో డేటా ఎంట్రీ ఆపరేటర్ మూడేళ్లుగా లేకపోవడంతో ఆశాలు, ఏఎన్ఎంలు నిర్వహించిన టెస్టులు, ఇరతనివేధికల కోసం ఇబ్బంది పడాల్సి వస్తోంది. వైద్యురాలే స్వయంగా దగ్గర ఉండి ఏఎన్ఎంతో ఆన్‌లైన్ చేయిస్తుండటం గమనార్హం. దీని పరిధిలో మొత్తం 49వేల జనాభా ఉంది. మొత్తం ఐదు సబ్‌సెంటర్లు ఉన్నాయి. జూబ్లీపుర, నిజాంపేట, ఖిల్లా, బ్యాంకు కాలనీ, శ్రీనగర్ కాలనీ ఉన్నాయి. ఇవన్నీ అద్దె ఇళ్లలోనే నిర్వహిస్తున్నారు.



డేటా ఎంట్రీ చేస్తున్న డాక్టర్ దేవిశ్రీ

సమయాన్ని పాటించరు...

నగరంలోని మామిళ్లగూడెం పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిత్యం రోగులు డాక్టర్ల కోసం ఎదురు చూస్తున్నారు. డాక్టరు, స్టాఫ్ నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టు ఆలస్యంగా హాస్పిటల్‌కు వస్తుండటంతో రోగులు నిరాశకు గురవుతున్నారు. ప్రధానంగా డాక్టర్ సమయాన్ని పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఒక స్టాఫ్ నర్సు పోస్టు ఖాళీగా ఉంది. అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయి. ఉద్యోగుల హాజరు కోసం ఫేస్ ఐడీ ఉన్నా సకాలంలో ఉద్యోగులు రావడం లేదు. హాస్పిటల్‌లో కొన్ని రకాల ఉచిత మందులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ముస్తాఫానగర్ దవాఖానాలో ముస్తాఫానగర్ ఆసుపత్రిలో రోజుకు 70మంది రోగులు వస్తున్నారు. ఇక్కడ ఒక ఏఎన్ఎం పోస్టు ఖాళీ ఉంది.

మామిళ్లగూడెం బస్తీ దవాఖానాలో డాక్టర్ల కోసం పడిగాపులు కాస్తున్న రోగులు



అసంపూర్తిగా రెండు భవనాలు

సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలోని రాజీవ్‌నగర్‌లోని బస్తీ దవాఖానా లో మందుల కొరత లేకుండా దగ్గరలోని గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ముందుగానే ఇండెంట్ స్టాక్ పెట్టుకున్నారు. ఇక్కడ సేవలు అందించేది ఎంబీబీఎస్ స్థాయి వైద్యులు కావడంతో వైద్య సేవలు సంతృప్తికరంగా సాగుతున్నట్లు రోగులు చెబుతున్నారు. వర్షాకాలంలో ఎక్కువ మంది రోగులు వచ్చిపోతుండగా ఆసుపత్రి ఆవరణలో షెడ్ నిర్మించాల్సి ఉంది. కాలనీవాసులతో పాటు చుట్టుపక్కల సత్తుపల్లి, గౌరిగూడెం, కొత్తూరు, సదాశివునిపేట, నారాయణపురం తదితర గ్రామాల నుంచి ప్రజలు ఇక్కడకు వచ్చి వైద్యసేవలు పొందుతున్నారు. విరాట్‌నగర్, హనుమాన్ నగర్ దవాఖానాల భవన నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోవడంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సేవలు అందడం లేదు.



సత్తుపల్లిలో అసంపూర్తిగా హనుమాన్ నగర్ ఆస్పత్రి భవనం

సంతృప్తిగా వైద్యసేవలు

మధిర పట్టణంలో రెండు సబ్‌సెంటర్లు పని చేస్తుండగా మధిర మునిసిపాలిటీకి కొత్తగా ఒక బస్తీ దవాఖాన మంజూరు కాగా, మధిర మునిసిపాలిటిలో విలీన గ్రామం అయిన మడుపల్లిలో ఏర్పాటు చేశారు. మధిరలో ఉన్న సబ్‌సెంటర్ల పేర్లు మాత్రం పల్లె దవాఖానగా మార్చి నడుపుతున్నారు. ఈ కేంద్రాల్లో రోగులకు సకాలంలోనే వైద్యం అందుతున్నా పూర్తి స్థాయిలో వైద్యం అందడం లేదనే విమర్శలు ఉన్నాయి.



రాజీవ్‌నగర్‌లో పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన రోగులు

కొత్తగూడెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగూడెం నియోజకవర్గంలో కొత్తగూడెం పట్టణం, పాల్వంచ పట్టణాల్లోనే పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. కొత్తగూడెంలోని రామవరం, పాత కొత్తగూడెం, సఫాయిబస్తీలో మూడు కేంద్రాలు ఉండగా పాల్వంచలో గుడిపాడు, శేఖరం బంజరలో రెండు మాత్రమే అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. ఇల్లెందు పట్టణంలో ఇటీవల కాలంలోనే ఒక అర్బన్ హెల్త్ సెంటరు మంజూరైంది. ఇల్లెందు పట్టణంలోని 24వ వార్డు కోర్టు సమీపంలో అర్బన్ హెల్త్ సెంటరు నిర్మాణం కోసం గత నెలలోనే శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదు.

నిధుల కొరతతో ఇక్కట్లు

పాత కొత్తగూడెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెండేళ్ల నుంచి ఆసుపత్రి డెవలప్‌మెంట్ సొసైటీ ఫండ్ (హెచ్‌డీఎస్‌ఎఫ్) నిధులు రావడం లేదు. రెండేళ్లుగా బయోమెడికల్ వేస్టేజ్ చార్జీలురావడం లేదు. వైద్యశాలలో మంచినీరు, ఇంటర్నెట్, విద్యుత్ తదితర ఖర్చులకు రూ.2వేలను ఇక్కడ పని చేసే వైద్యులే సొంతంగా ఖర్చు పెడుతున్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ గోడ కూలిపోయింది. ఇక్కడ విధులు నిర్వహించే డాక్టర్ రాకేష్ కుమార్ యూఎఫ్‌డబ్ల్యూసీ కొత్తగూడెం, ఏ పవర్ హౌస్ దవాఖానాతో పాటుగా ఇక్కడి హెల్త్ సెంటరుకు ఇంచార్జీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నాలుగునెలల నుంచి మందుల కొరత ఉంది.



రామవరంలో వైద్య సిబ్బంది

వేధిస్తున్న మందుల కొరత

పాల్వంచ పట్టణ పరిధిలో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. వాటిలో గుడిపాడు అర్బన్ హెల్త్ సెంటరు, శేఖరంబంజరులో ఉంది. గుడిపాడులో ఒక మెడికల్ ఆఫీసర్, అయిదుగురు ఏఎన్ఎంలు పని చేస్తున్నారు. వారిలో ఒకరు పదవీ విరమణ చేశారు. ఎనిమిదిమంది ఆశా వర్కర్లు ఉండగా ఇద్దరు రావడంలేదు. ప్రస్తుత సిబ్బందితో పాటు రోగులకు మందుల కొరత ఉంది.



శేఖరం బంజర అర్బన్ హెల్త్ సెంటర్

వైద్యుల కోసం రోగుల ఎదురుచూపులు

ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో రోగులు వైద్యం కోసం పడిగాపులు పడాల్సి వస్తోంది. ఉదయం 10.30గంటల వరకు కూడా హాజరు కావడం లేదు. వివిధ రకాల ప్రత్యేక వైద్యం అందుతున్నప్పటికీ సమయాన్ని పాటించడం లేదు. ఎమర్జెన్సీ వార్డులో వైద్యులు లేకపోవడంతో సాధారణ డ్యూటీ వైద్యులే వైద్యం చేస్తున్నారు. తాగునీటి సౌకర్యం లేదు. వైద్యులు ఎక్కువ మంది ప్రైవేట్ వైద్యశాలలో పని చేస్తున్నారు.



గుడిపాడు అర్బన్ హెల్త్ సెంటర్

సర్వేలో సిబ్బంది

కొత్తగూడెం పరిధిలో రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌళిక సదుపాయాలు లేవు. ఆసుపత్రి అభివృద్ధికి గత నాలుగేళ్లుగా నిధులు మంజూరు కావడం లేదు. స్వీపర్‌పోస్టు ఖాళీగా ఉంది. వైద్య సిబ్బంది సకాలంలో విధులకు రావడం లేదనే విమర్శలు ఉన్నాయి. కుష్ఠు వ్యాధి సర్వేలో సగం సిబ్బంది ఉండటంతో ఆసుపత్రిలో అందుబాటులో ఉండటంలేదు.కొత్తగూడెం పట్టణంలోని సఫాయిబస్తీ అర్బన్ హెల్త్ సెంటరులో సిబ్బంది సమయాన్ని పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి. మందుల కొరత ఈ హెల్త్ సెంటరులో ఉంది. నిధులు రావడం లేదు.



అరకొర మందులతో సఫాయిబస్తీ ఆరోగ్య కేంద్రం

మక్కకు దక్కని 'మద్దతు'



మొక్కజొన్నలను విక్రయిస్తున్న రైతులు

(5వ పేజీ తరువాయి)

మించితే ఆ పంటను కొనరు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలపై ఆశ పెట్టుకోవడం లేదు. కేంద్రాలు ఏర్పాటు చేసినా ఏం కొర్రీలు పెడతారోనన్న అనుమానంతో రైతులు ప్రవేటు వ్యాపారులకు తమ పంటను అమ్ముకుంటున్నారు.

ప్రభుత్వ మద్దతు ధర కంటే ప్రైవేటులో కొంత ధర తక్కువే వస్తున్నా పంట చేతికొస్తున్న తరుణంలో మరింత ఆలస్యం చేస్తే ఇంకా ధరలు పతనమవుతాయని రైతులు ముందే పంటను అమ్ముకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి తాము నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాల కోసం ప్రయత్నిస్తాం

బాలాజీ, ఏవో కొణిజర్ల

రైతులు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారని ఎదురుచూస్తున్న మాట వాస్తమే.. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం.. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేసే అవకాశం ఉంది.

ఆశించిన దిగుబడి రాలేదు...

రాయల నరేష్, మక్కరైతు



మూడున్నర ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశా.. ఎకరానికి 40క్వింటాళ్ల దిగుబడి వస్తుందనుకుంటే 30క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదు. పెట్టుబడి ఖర్చు ఎకరానికి రూ.50వేలు అయ్యింది. ఇంత ఖర్చు చేస్తే రైతులకు ఏం మిగులుతుంది. రైతులకు మేలు చేసేలా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

ఇళ్లల్లో దోచి... శ్మశానాల్లో దాచి..

(5వ పేజీ తరువాయి)

సమాచారం మేరకు సత్తుపల్లి మండలం కొత్తూరు సమీపంలోని శ్మశాన వాటిక వద్ద సురేందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 461.18 గ్రాముల బంగారు, 426 గ్రాముల వెండి, రూ.3.33లక్షల నగదు, ఒక మొబైల్ ఫోన్, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.45 లక్షలు ఉంటుంది.

సురేందర్ నుంచి మారణాయుధాలు స్వాధీనం చేసుకుని అతణ్ని అరెస్ట్ చేసి హత్యాయత్నం, చోరీ కేసులు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు కమిషనర్ తెలిపారు. సురేందర్ తన తల్లికి చీర కొనివ్వాలనే కోరికతో మొట్టమొదటిసారి రూ.300 చోరీ చేసి చీర కొనుగోలు చేశాడని, అప్పటి నుంచి చోరీలు కొనసాగిస్తూ అంతర్‌రాష్ట్ర దొంగగా మారాడని కమిషనర్ వివరించారు.

కాగా, సురేందర్ ఆచూకీ కనుగొనే క్రమంలో తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ నరేష్‌తో పాటు అతడిని ఆసుపత్రికి తరలించిన పౌరులు ఇల్లంగి రాజు, చెరుకుపల్లి ప్రసాద్‌లను కమిషనర్ ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డు అందజేశారు. వీరితో పాటు సురేందర్‌ను అరెస్ట్ చేసిన ఎస్‌ఐ టి.కవిత, కానిస్టేబుళ్లకు ప్రశంసాపత్రాలతో పాటు క్యాష్ అవార్డులను అందజేశారు. విలేకరుల సమావేశంలో కల్లూరు ఏసీపీ ఎ.రఘు పాల్గొన్నారు.

చతికిల పడిన 'సుడా'

(5వ పేజీ తరువాయి)

పరిశీలన చెల్లింపులు జరిగాయి. వరంగల్‌లో ఎల్‌ఆర్‌ఎస్‌కు 1,00,992 దరఖాస్తులు ఉండగా వాటిలో ఫీజు చెల్లింపులకు 34,032 అర్హత పొందాయి. వాటిలో 1,686 ఫీజులు చెల్లించారు. 767 దరఖాస్తులకు ప్రొసీడింగ్స్ పంపిణీ జరిగింది. ఖమ్మంలో ఇప్పటికే 1,875 ఫీజులు చెల్లింపులు కాగా, వాటిలో 1,405 దరఖాస్తులకు ప్రొసీడింగ్స్ పంపిణీ జరిగింది. కేఎంసీ ద్వారా మంగళవారం వరకు రూ.11.72 కోట్ల వరకు ఆదాయం రాష్ట్ర ప్రభుత్వానికి సమకూరింది. మరో వైపు ఖమ్మం స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చతికల పడిందా... అనే రీతిలో ఎల్‌ఆర్‌ఎస్ చెల్లింపుల ప్రక్రియ కనిపిస్తోంది. ఇప్పటి వరకు సుడా పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్‌కు 34,045 దరఖాస్తులు అందాయి. వాటిలో ఎల్‌ఆర్‌ఎస్ చెల్లింపులకు 7,997 దరఖాస్తులు అర్హత పొందాయి. కాని 250 దరఖాస్తుల నుంచే సుడా అధికారులు చెల్లింపుల ప్రక్రియ పూర్తి చేశారు.

కేఎంసీకే పరిమితం

సుడా పరిధిలో ఖమ్మం రూరల్, ముదిగుండ, కూసుమంచి, చింతకాని, కొణిజర్ల, రఘునాథపాలెం మండలాలు ఉన్నాయి. ఆయా మండలాలకు సుడా అధికారులు వెళ్లి గ్రామ పంచాయతీ కార్యదర్శులతో పర్యవేక్షణ చేసి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు చెల్లింపులు చేపట్టాల్సి ఉండగా, సుడా అధికారులు కేవలం కేఎంసీ కార్యాలయానికే పరిమితమవుతున్నారనే ఆరోపణలు వ్యాపిస్తున్నాయి.

సీతారామ ప్రాజెక్టు జలాలు అందించండి..

సీఎంకు అఖిలపక్షం నేతల వినతి

ఇల్లెందు టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు నియోజకవర్గంతోపాటు డోర్నకల్ నియోజకవర్గాలకు సీతారామ ప్రాజెక్టు జలాలు అందేలా చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆధ్వర్యంలో అఖిలపక్షం నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విన్నవించారు. సీతారామ ప్రాజెక్టును ఇల్లెందుకు మళ్లించడంతోపాటు బోడు, కొమరారం కేంద్రాలుగా నూతన మండలాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. సీతారామ ప్రాజెక్టు రీడిజైన్ పేరుతో గోదావరి జలాలను ఇల్లెందుకు రాకుండా అడ్డుకుంటున్నారని ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, అధికారులతో అఖిలపక్షం ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డికి సూచించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క, ఇల్లెందు, డోర్నకల్, మహబూబాబాద్, వైరా ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, రాంచంద్రనాయక్, మురళీ, మాలోత్ రాందాస్‌నాయక్, అఖిలపక్ష నాయకులు దేవరకొండ శంకర్, ఆలేటి కిరణ్, ముద్రగడ వంశీ, గోపగాని శంకర్‌రావు, గౌని నాగేశ్వరరావు, యాకూబ్ షావళి, బండారు మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

ప్రజల పక్షం వహించే వారికే ఆదరణ

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

కొత్తగూడెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలపక్షం వహించే పార్టీలనే ప్రజలు ఆదరిస్తారని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా అన్నారు. జగదల్‌పూర్‌లో సమావేశం ముగించుకుని కొత్తగూడెం మీదుగా విజయవాడ వెళ్తున్న క్రమంలో కొత్తగూడెంలోని జిల్లా పార్టీ కార్యాలయం శేషగిరిభవన్‌ను సందర్శించి కార్యదర్శి సాబీర్‌పాషాతో సమావేశమయ్యారు. కమ్యూనిస్టు పార్టీ నిర్వహించే ప్రజా పోరాటాల్లో రాష్ట్రంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎందరో జాతీయనాయకులను కమ్యూనిస్టు పార్టీకి అందించిందని ప్రజా ప్రతినిధులుగా ప్రజాగొంతుకను వినిపించే నేతలను చట్టసభలకు పంపిందన్నారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు జిల్లాలో పార్టీ విస్తరణకు, ప్రజాప్రతినిధిగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం శ్రమిస్తుండటం హర్షణీయమన్నారు. 2025 సభ్యత్వం పూర్తి చేయడంపై జిల్లా నాయకత్వాన్ని అభినందించారు. ఆయన వెంట సీపీఐ జాతీయ నేత రామకృష్ణ పాండే ఉన్నారు.

వరాల జల్లు కురిసేనా!?

(5వ పేజీ తరువాయి)

ప్రాజెక్టుతో పాటు సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణం నిధుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. నిధులు కేటాయిస్తే అసంపూర్తిగా ఉన్న పనులతో పాటు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ పనులు కూడా జరిగి మారుమూల గ్రామాలకు గోదావరి జలాలు అందే అవకాశం ఉంది. 2026 ఆగస్టు 15 నాటికి సీతారామ పనులు పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి గత ఏడాది వైరా సభలో హామీ ఇచ్చారు. ఈ ఏడాది పనులు జరగాలంటే కనీసం రూ.5వేల కోట్లు అవసరం ఉంది. పాలేరు లింకు కెనాల్ పనులతో పాటు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులు చేపడితేనే సీతారామ ద్వారా ఎక్కువ ఆయకట్టుకు నీరు లభిస్తుంది. ప్రస్తుతం ఉన్న ప్రధాన కాలువ ద్వారా సాగర్ ఆయకట్టుకు మాత్రమే నీరందించే పరిస్థితి నెలకొంది. సీతారామ పనులకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.5వేల కోట్లు అవసరమని ఇంజనీరింగ్ వర్గాలు పేర్కొంటున్నాయి.

పెదవాగు పరిస్థితి...

అశ్వారావుపేట మండలానికి చెందిన ఉమ్మడి తెలుగురాష్ట్రాల ప్రాజెక్టు పెదవాగుకు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తేనే పనులు జరిగే అవకాశం ఉంది. గత ఏడాది వర్షాలకు పెదవాగు గేట్లు కొట్టుకుపోయిన విషయం విదితమే. పునరుద్ధరణకు సుమారు రూ.94కోట్లతో ప్రతిపాదనలు చేసింది. ప్రాజెక్టు సామర్థ్య అదనపు గేట్లతో ప్రతిపాదనలు చేశారు. రెండు రాష్ట్రాలనుంచి ఉమ్మడి ప్రాజెక్టుగా నిధుల కేటాయింపు జరగాల్సి ఉంది. బడ్జెట్‌లో దీనికి నిధులు కేటాయింపు ఉంటుందా లేదా అన్నది చెప్పలేని పరిస్థితి. జిల్లాలో తాలిపేరు,కిన్నెరసాని, జాలిముడి, లంకసాగర్, బేతుపల్లి, వైరా, పాలేరు ప్రాజెక్టులకు సంబంధించి కాలువల మరమ్మతులకు నిధుల అవసరం ఉంది.

అలాగే జిల్లాలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలలకు, ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు మునిసిపల్ పట్టణాలకు గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు కూడా బడ్జెట్‌లో నిధుల కేటాయింపుతోనే పనులు జరగనున్నాయి. ఉమ్మడి జిల్లాలో మునిసిపల్ పట్టణాల్లో ప్రజారోగ్యశాఖ ద్వారా మౌలిక సదుపాయాల పనులకుప్రతిపాదనలు వెళ్లాయి. ఆర్‌అండ్‌బీ పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన రోడ్లు, కల్వర్టులకు కూడా నిధుల అవసరం ఉంది. ఇంజనీరింగ్‌శాఖలో ప్రతిఏటా ప్రతిపాదనలు చేయడం తప్ప ఆశించిన విధంగా కేటాయింపులు లేవు. ఈసారైనా నిధులు కేటాయిస్తారని ఆశిస్తున్నారు. ఖమ్మం కార్పొరేషన్‌లో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి రూ.1200 కోట్ల నిధుల అవసరం ఉంది. అలాగే ప్రస్తుతం మంజూరై జరుగుతున్న పలు నిర్మాణ పనులకు కూడా నిధుల ఆవశ్యకత ఉంది. మరి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆర్థికమంత్రి ఏం చేస్తారో చూడాలి.

ఆర్‌ఎంపీపై మరో ఆర్‌ఎంపీ దాడి

(5వ పేజీ తరువాయి)

అప్పటికే ఆర్‌ఎంపీగా వున్నాడు. ఇంటి వద్దే క్లినిక్ ఏర్పాటు చేసుకొని వైద్యం చేస్తున్నాడు. రంగారావు బైక్‌పైన రోగుల వద్దకే వెళ్లి వైద్యం చేస్తుండటంతో అతడికి ఆదరణ పెరిగింది. రంగారావు వల్ల తనకు రోగుల తాకిడి తగ్గుతోందని రాధాకృష్ణ కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే దాడికి పన్నాగం పన్నాడు. గత శనివారం రాత్రి 8గంటల సమయంలో రంగారావు నెమలిపురిలో ఓ వ్యక్తికి వైద్యం చేసి తిరిగి వస్తుండగా.... నెమలిపురి కుంట దగ్గర రాధాకృష్ణ మరో నలుగురు వ్యక్తులతో కలిసి రంగారావు బైక్‌ను ఆపారు. అనంతరం బూతులు తిడుతూ రాడ్లతో మూకుమ్మడిగా దాడి పాల్పడ్డారు. ఈ ఘటనలో రంగారావు తలకు, చెవికి తీవ్ర గాయాలయ్యాయి. అయితే ఆ సమయంలో అటుగా ఓ బైక్ రావడంతో వారిని చూసి రాధాకృష్ణ సహా అందరూ పారిపోయారు. అనంతరం రంగారావు పరుగు పరుగున ఊర్లోకి వెళ్లి, బంధువులకు సమాచారం ఇచ్చి కారులో ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. అనంతరం కామేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఈ సంఘటనపై ఎస్‌ఐ బీ. సాయికుమార్‌ను వివరణ కోరగా రంగారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. దాడికి యత్నించిన వారిని వేముల రాధాకృష్ణ, దారావత్ ఈశ్వర్, దారావత్ నాగలక్ష్మి, ఖమ్మంకు చెందిన కుక్కల కార్తీక్, సుమంత్, వేణుగా గుర్తించినట్టు తెలిపారు. వారిని అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పరుస్తామని తెలిపారు.

పాలేరు జేఎన్‌టీయూ భవనాల పనులకు మోక్షం

- రూ.70.28 కోట్లతో పనులకు టెండర్ల ఆహ్వానం

ఖమ్మం, మార్చి 18 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రెండేళ్లుగా తాత్కాలిక భవనాల్లో కొనసాగుతున్న పాలేరు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీకి సొంత భవనాలు రానున్నాయి. నూతన భవన నిర్మాణాల పనుల కోసం రూ.70.28కోట్లతో జేఎన్‌టీయూ టెండర్లు చేపట్టింది. ఈనెల 11న ఆన్‌లైన్ ద్వారా టెండర్లు ఆహ్వానించింది. రెండేళ్ల క్రితం ఖమ్మం జిల్లాకు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీని గత ప్రభుత్వం మంజూరు చేయగా ఖమ్మంరూరల్ మండలం మద్దులపల్లిలో ఐటీడీఏ ఒకేషనల్ ట్రైనింగ్ భవనంలో తాత్కాలింకగా ప్రారంభించారు. ప్రస్తుతం జేఎన్‌టీయూ రెండో ఏడాది తరగతులు జరుగుతున్నాయి. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో 47 ఎకరాల భూమిని కేటాయించారు. ఆ తర్వాత మంత్రి జేఎన్‌టీయూ అధికారులతో పలు సార్లు చర్చించి శాశ్వత భవనాలకు ప్రతిపాదనలు సిద్ధంచేయమని ఆదేశించారు. సుమారు రూ.500కోట్లతో పాలేరు జేఎన్‌టీయూకు పూర్తిస్థాయి భవనాలు, హాస్టల్ సౌకర్యాలు, క్రీడామైదానాలు, ఆడిటోరియం తదితర భవనాల నిర్మాణానికి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ విభాగం సిద్ధంచేసింది. కాగా మొదట భవనాల నిర్మాణాలు చేపట్టేందుకు మంత్రి పొంగులేటి చొరవ తీసుకుని గతేడాది సెప్టెంబరులో రూ.108.60కోట్లు జేఎన్‌టీయూకు ప్రభుత్వం కేటాయిచింది జేఎన్‌టీయూకు శాశ్వత పాలకవర్గం లేకపోవడం, ఇంజనీరింగ్ విభాగం డిజైన్లను జాప్యం చేసింది. ఇటీవల పూర్తిస్థాయి వీసీని నియమించడం, భవనాలకు ప్రాథమికంగా అవసరమైన ప్రతిపాదనలు సిద్ధంచేసి జేఎన్‌టీయూ టెండర్లు ఆహ్వానించింది. మొదటగా విద్యాబోధనకు అవసరమైన రూ.70.28కోట్లతో భవనాలు నిర్మించేందుకు టెండర్లు ఆహ్వానించింది. విద్యా బోధనల, హాస్టల్ భవనాలు పూర్తయితేనే పాలేరు జేఎన్‌టీయూ కళాశలకు గుర్తింపు రానుంది. ప్రస్తుతం టెండర్లు జరిగిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

ఓటరు జాబితా సవరణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా ఓటు హక్కు కల్పించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో ఓటరు జాబితా సవరణపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా జరగాలని, ప్రజాస్వామ్య విలువలు నెలకొల్పేందుకు ఓటరు జాబితా కీలకమైందన్నారు. ఓటరు జాబితా, పారదర్శకమైన పోలింగ్ సిబ్బంది, ఈవీఎం యంత్రాలు, బ్యాలెట్ పేపర్లు ఎన్నికల వ్యవస్థకు కీలకమని అదనపు కలెక్టర్ అన్నారు. ఎన్నికల సమయంలో కాకుండా ఓటరు జాబితా సవరణపై రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎప్పటి కప్పుడు సమీక్ష చేసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు సి.హెచ్. నాగేశ్వర్ రావు, జి. విద్యాసాగర్, ఎన్.నాగేశ్వర రావు, గోపాల్ రావు, లింగాబోయిన సతీష్, పీటీఆర్. కృష్ణ ప్రసాద్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీహెచ్. స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డీటీ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

సన్నరకం ధాన్యానికి బోనస్ చెల్లింపులు

ఇంకా 13850మంది రైతులకు రూ.37.76కోట్ల పెండింగ్

వైరా, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంజిల్లాలో రబీ ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్న అధికారులు ఖరీఫ్‌లోని సన్నరకం ధాన్యానికి పూర్తిస్థాయిలో బోనస్ సొమ్మును ఇంకా చెల్లించలేదు. ఆ సొమ్ము కోసం అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. నిధుల లభ్యతను బట్టి నెమ్మది నెమ్మదిగా రైతుల ఖాతాల్లో ఈ బోనస్ సొమ్మును జమ చేస్తున్నారు. ఇంకా ఖమ్మంజిల్లాలో మంగళవారం నాటికి 13850మంది రైతులకు రూ.37.76కోట్ల బోనస్ సొమ్ము పెండింగ్‌లో ఉంది. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన సన్నరకకం ధాన్యాన్ని 47,494మంది రైతుల నుంచి 27,26,660క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ ధాన్యానికి సంబంధించి రూ.136కోట్ల, 33లక్షల, 30వేలను బోనస్‌గా చెల్లించాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు 33,644మంది రైతులకు రూ.98కోట్ల, 57లక్షల, 13800ను చెల్లించారు. ఇంకా 13,850మంది రైతులకు రూ.37కోట్ల, 76లక్షల, 16,200ను బోనస్ కింద చెల్లించాల్సి ఉంది. గతనెల 17నాటికి జిల్లాలో 24,250మందికి రూ.71కోట్ల, 91లక్షల, 46,600చెల్లించారు. కచ్చితంగా నెల వ్యవధిలో 9,394మంది రైతులకు రూ.26కోట్ల, 65లక్షల, 67,200ను చెల్లించారు. అంటే ఈ మొత్తం చెల్లింపులు 33,644మంది రైతులకు రూ.98కోట్ల, 57లక్షల, 13,800కు చేరుకున్నాయి. ఇంకా మిగిలిన 13850మంది రైతులు తమ బోనస్ సొమ్ము కోసం ఎదురుచూస్తున్నారు. వైరా మండల విషయానికి వస్తే... మొత్తం 3,836 మంది రైతులు ధాన్యాన్ని విక్రయించగా ఇప్పటివరకు 1245మంది రైతులకు మాత్రమే రూ.3,95,58,400 బోనస్ వచ్చింది. ఇంకా 2,591మంది రైతులకు రూ.7,93,59,600 బోనస్ సొమ్ము రావల్సి ఉంది. తమకు వెంటనే బోనస్ చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

కేంద్ర మంత్రికి వద్దిరాజు పరామర్శ

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి18(ఆంధ్రజ్యోతి): కేంద్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్రయాదవ్ తండ్రి కదం సింగ్ ఇటీవల మృతిచెందడంతో విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్లమెంటరీ ఉపనేత, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మంగళవారం ఢిల్లీలో కేంద్రమంత్రి నివాసంలో కేంద్రమంత్రిని పరామర్శించారు. ఈ సందర్భంగా కదంసింగ్ చిత్రపటానికి వద్దిరాజు రవిచంద్ర పూలమాలలువేసి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రముఖయోగా గురువు బాబా రాందేవ్‌తో వద్దిరాజు సమావేశమయ్యారు.

ఏదులాపురం మునిసిపాలిటిలో..

ప్రారంభమైన పనులు

నేటినుంచి జనన, మరణ ధ్రువపత్రాల జారీ...?

పారిశుధ్యం, ఇంటి పన్నుల వసూళ్లకు ప్రత్యేక టీంల ఏర్పాటు

కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి

ఖమ్మం రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మున్సిపాలిటి ఏర్పాటు జరిగి సుమారుగా రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి పనులూ జరగలేదు. దీంతో మున్సిపాలిటి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే ప్రభుత్వం నూతన మున్సిపల్ కమిషనర్‌గా ఆళ్ల శ్రీనివాస్ రెడ్డిని నియమించింది. సోమవారం బాధ్యతలు చేపట్టిన ఆయన మంగళవారం గ్రామాల వారీగా సమస్యలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్రధాన సమస్యలు అయిన జనన, మరణ ధ్రువపత్రాలు, ఇంటి అనుమతులు, తాగునీరు, పారిశుధ్యంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జనన, మరణ ధృవపత్రాల మంజురు విషయంపై జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడారు. బుధవారం వాటికి సంబంధించిన డిజిటల్ కీ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. వెంటనే జనన, మరణ ధృవపత్రాలు అందించడం జరుగుతుందన్నారు. అదేవిదంగా గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సమస్యలకు సంబంధించి టీంలను ఏ ర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. మునిసిపాలిటి పరిధిలోని అన్ని గ్రామాల్లో ఇంటి పన్నుల వసూళ్లకు సంబంధించి ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి పన్నులు వసూల్ చేయిస్తామని తెలిపారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా వెం టనే తనను సంప్రదిస్తే అట్టి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని క మిషనర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

విద్యుత్ లైన్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జితేష్

కొత్తగూడెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పోడు వ్యవసాయం చేసే రైతులకు నీటి సౌకర్యం కోసం విద్యుత్‌లైల్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని పోడు వ్యవసాయానికి విద్యుద్దీకరణ, ఉపాధిహామీ పనుల పురోగతి, తాగునీటి సంరక్షణ చర్యలు, మొక్కల పెంపకం, ఇంకుడు గుంతలు తవ్వకాలు, మీ సేవ దరఖాస్తులు, ధరణి, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత అధికారులతో కలెక్టర్ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.

కలెక్టర్ మాట్లాడుతూ పోడు పట్టాలు పొందిన రైతులు, వ్యవసాయం చేయడానికి వీలుగా నీటి వసతి కల్పించటానికి గాను వ్యవసాయ భూములకు విద్యుద్దీకరణకు అవసరమైన లైట్ల ఏర్పాటుకు అటవీశాఖాధికారులు, పంచాయతీ సెక్రటరీలు సమన్వయంతో తగిన ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. విద్యుత్ లైన్ల ఏర్పాటు సాధ్యం కానీ ప్రదేశాల్లో అటవీశాఖాధికారుల ఆమోదంతో బావులు తవ్వి సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు ద్వారా పోడు సాగుకు నీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. పోడు భూముల్లో ఆయిల్ ఫామ్ సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గిరిజన రైతులకు నీటి సౌకర్యం కల్పించేందుకు గాను విద్యుత్‌లైన్‌లో ఏర్పాటు సహకరించాలని అటవీశాఖాధికారి కృష్ణగౌడ్‌ను కలెక్టర్ కోరారు.

జిల్లాలోని అన్ని మండల అటవీశాఖ రేంజర్లు అటవీశాఖ పరిధిలో ఉపాది హామీ పథకం కింద చేపట్టాల్సిన పనులను గుర్తించి నివేదికలు అందించడం ద్వారా త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఉపాధిహామీ పథకం లక్ష్యాలను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని వ్యవసాయ భూముల్లో ఫామ్‌పౌండ్ (నీటి గుంతల) తవ్వకాల కోసం రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయశాఖాధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

జిల్లా వ్యాప్తంగా పెండింగ్ ఓటరు మార్పులు, చేర్పులు, నూతన ఓటరు దరఖాస్తులు, మీసేవ కేంద్రాల్లో వివిధ అవసరాల నిమిత్తం ప్రజలు చేసుకున్న దరఖాస్తులు ఎల్ఆర్ఎస్, ధరణి పెండింగ్ దరఖాస్తులు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంవత్సరం కంటే ఎక్కువ కాలం ఉన్న పెండింగ్ ధరణి దరఖాస్తులను ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, అడిషనల్ డీఆర్‌డీవో రవి, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాసరావు, మహిళా శిశు సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా, విద్యాశాఖాధికారి వెంకటేశ్వర చారి, ఎస్సీ సంక్షేమ అధికారి అనసూర్య, బీసీ సంక్షేమ అధికారి ఇందిర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

ప్రత్యేక కార్యాచరణతో 'ఉపాధి' అమలు

పనులపై సమీక్షించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాబోయే 10 రోజుల పాటు ప్రత్యేక కార్యాచరణతో ఉపాధిహామీ పనులను జిల్లాలో అమలు చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ఉపాధి హామీ పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద కేటాయించిన పనుల లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలోని అటవీ ప్రాంతాలలో ట్రెంచ్, ఫీల్డ్ చానల్స్, చెరువు కాల్వల పూడిక తీత పనులను రాబోయే 10 రోజులలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఉపాధి హామీ క్రింద చేపట్టాలని, తద్వారా లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. అటవీ ప్రాంతంలో వాటర్ అబ్జర్వింగ్ మొక్కల పెంపకం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. భూగర్భ జలాలు తగ్గిపోతున్న ఖమ్మం రూరల్, కూసుమంచి, నేలకొండపల్లి తిరుమలాయపాలెం, వైరా, ఏన్కూరు, సింగరేణి మండలాలలో 15 చొప్పున రేయిన్ హార్వెస్టింగ్ పిట్‌లను ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులతో సంప్రదించి ఆసక్తిఉన్న రైతుల పొలాల్లో ఫామ్ పాండ్ ఏర్పాటు చేపట్టాలని, మండలానికి కనీసం 5 ఫామ్ పాండ్లు ఏర్పాటుచేయాలన్నారు. జిల్లాలో హార్టికల్చర్ శాఖ ద్వారా పంటలను పెంచేందుకు కూడా ఉపాధి హామీ పథకం వినియోగించుకోవాలని అన్నారు. తిరుమలాయపాలెం మండలంలో అత్యధికంగా డెంగ్యూ కేసులు గతంలో నమోదయ్యాయని, రాబోయే కాలంలో ఇవి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డీఆర్వో పద్మశ్రీ, డీఆర్డీవో సన్యాసయ్య, వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, పంచాయతీరాజ్ ఈఈ వెంకట్ రెడ్డి, డీఎల్పీవో రాంబాబు పాల్గొన్నారు.

స్వాగత ద్వారానికి

రంగులు

భద్రాచలం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు పట్టణంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయం వద్ద ఉన్న స్వాగత ద్వారానికి రంగులు వేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పనులు వేగంగా సాగుతున్నాయి. ఇదిలా ఉండగా శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 12 వరకు స్వామి వారి నిత్యకల్యాణాలను నిలిపివేయనున్నట్లు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి వెల్లడించారు. ఏప్రిల్ 13 నుంచి మళ్లీ నిత్యకల్యాణాలు పునః ప్రారంభం కానున్నాయని అన్నారు.

కంప్యూటర్, ఫర్నిచర్ జప్తు చేయాలని

న్యాయాధికారి ఆదేశం

ఖమ్మం లీగల్ మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం ఖానాపురం బైపాస్‌రోడ్ నిర్మాణానికి 321 గజాల ప్లాటు యజమాని మానుకొండ వెంకటేశ్వర్లు వద్దనుండి భూసేకరణ జరిపారు. వారికి నష్టపరిహారం చెల్లించాలని, జిల్లా కోర్టు, హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ ప్రభుత్వం చెల్లించనందున ఖమ్మం ప్రిన్సిపల్ జిల్లా న్యాయాధికారి కోర్టునందు ఈపీ నెం.29/2024 భూసేకరణ అధికారి ఆర్డీవోపై కేసు వేశారు. సాక్ష్యాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయాధికారి ఆర్డీవో ఆఫీసులోని కంప్యూటర్స్, ఫర్నిచర్‌ను జప్తుచేయమని ఆదేశాలు జారీచేశారు.ఈ కేసును వంజాకు లక్ష్మీనారాయణరావు, భూమి యజమాని మానుకొండ వెంకటేశ్వర్లు తరపున కేసు వాదించారు.

మిత్ర ఫౌండేషన్ 'ప్రోత్సాహకం'

మూడు లక్షల రూపాయల బహుమతులు

చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్ వెల్లడి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం గాంధీ చౌక్, మార్చి18 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరం జరుగబోయే 10వ తరగతి పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు మిత్ర ఫౌండేషన్ అద్భుతమైన ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు మిత్ర గ్రూప్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం నగరంలోని మిత్ర గ్రూప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రవీణ్ మాట్లాడారు. ప్రతిభ చూపించిన విద్యార్థులను గౌరవిస్తూ మొదటి స్థానం విద్యార్థికి 25,000 నగదు, ల్యాప్‌టాప్, ద్వితీయ స్థానం రూ. 25,000, తృతీయ స్థానం రూ.15,000 నగదు ఇవ్వనున్నామన్నారు. ఐదుగురు ప్రతిభావంతులకు ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున రూ. 50,000 నగదు బహుమతులు ఇవ్వనున్నామని, మొత్తం బహుమతుల విలువ: రూ.1,50,000గా ప్రకటించారు. ప్రత్యేక గిఫ్టుగా ఈ ఐదుగురు ప్రతిభావంతులకు విమాన ప్రయాణంతో 3 రోజుల ఢిల్లీ యాత్ర నిర్వహించి పార్లమెంట్ భవన్, రాష్ట్రపతి భవన్ సందర్శన అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతిభావంతులను ప్రోత్సహించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తుమ్మల యుగంధర్ అదనపు ప్రోత్సాహంతో, ఈ ఐదుగురు విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలలో అడ్మిషన్ సదుపాయం కల్పించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిత్ర గ్రూప్ డైరెక్టర్లు రంగా శ్రీనివాస్, చెరుకూరి యుగంధర్, పాలవరపు శ్రీనివాస్, చారుగుండ్ల రవికుమార్, నాగసాయి గ్యాస్ నగేష్, మేళ్లచెరువు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఇరువురికి జీవిత ఖైదు

కల్లూరు, మార్చి18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో గత రెండేళ్ల క్రితం జరిగిన ఓ హత్య కేసులో కారుకులైన ఇద్దరు వ్యక్తులపై జీవిత ఖైదీ విధిస్తూ సత్తుపల్లి కోర్టు అదనపు జిల్లా న్యాయాధికారి మంగళవారం తీర్పు నిచ్చారు. చెన్నూరు గ్రామానికి చెందిన పాటిబండ్ల శ్రీనువాసరావుకి దూరపు బంధువు అయిన పాటి బండ్ల శివ ఇంట్లో కొన్ని సమస్యలు ఉండటం, పశువులు కూడా చనిపోవడంతో నూతలపాటి నారాయణరావు అనే వ్యక్తి తల్లాడ మండలం మల్లారం గ్రామానికి చెందిన పాస్తం రంగారావు (గురుస్వామి)ని సంప్రదించి సమస్యను చెప్పాడు. శివ ఇంట్లో సమస్యలకి, పశువులు చనిపోవటానికి గల కారణం పాటిబండ్ల శ్రీనువాసరావు అనే వ్యక్తి ఉప్పలమ్మ పూజలు చేసే వ్యక్తి కారణమని చెప్పాడు.

దీంతో 2023లో పాటిబండ్ల శ్రీనువాసరావు చెన్నూరు గ్రామ శివారున గల పొలం వద్దకు వెళ్లగా శివ (ఏ-1) అక్కడికి వెళ్లి అతడిని కిరాతంగా నరికి చంపినాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నాటి పోలీసులు కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. మంగళవారం కేసును విచారించిన న్యాయాధికారి పాటిబండ్ల శివ, పాస్తం రంగారావులకు జీవితఖైదు విధించారు. ఈ సందర్భంగా కేసు పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ సిబ్బందిని సీపీ అభినందించారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఖమ్మంక్రైం, మార్చి18(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ ముసుగులో అక్రమాలకు పాల్పడుతూ అమాయకుల నుంచి రూ. లక్షలను దోచుకుంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు పోలీసు కమిషనర్ సునిల్‌దత్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఖమ్మం అర్బన్ మండలం అగ్రహారం ప్రాంతంలోని రియల్ ఎస్టేట్ వెంచర్‌లో తమకు సంబంధం లేని పలు ప్లాట్లపై తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి పలువురికి విక్రయించి మోసం చేసిన నాయుడుపేటకు చెందిన మానుకొండ శ్రీనివాస్, నగరానికి చెందిన తల్లాపల్లి రాజగిరి, సిలివేరు రవి ముగ్గురు కలిసి రూ.5లక్షల వరకు మోసం చేశారని, అదే విధంగా మరో ఇద్దరు నుంచి రూ.25లక్షల వరకు తీసకుని మోసం చేశారని ఖమ్మం పార్శీబంధం ప్రాంతానికి చెందిన వినుకొండ మరియన్న ఫిర్యాదు మేరకు సీసీఎస్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదుచేసి విచారణ జరిపినట్లు తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

బూర్గంపాడు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అంజనాపురం గ్రామానికి చెందిన బాణావత్ నారయణ(56) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో ఆ బాధ తట్టుకోలేక సోమవారం రాత్రి సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య కు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మంగళవారం మృతుడి కుమారుడు చందర్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గన్నవరంలో బెల్టుషాపుపై దాడి

వైరా, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నవరం గ్రామంలో ఉన్న బెల్టుషాపుపై ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడి చేశారు. బెల్టుషాపులో ఉన్న రూ.25వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకొని నిర్వాహకుడు దారా మల్లికార్జున్‌రావును అదుపులోకి తీసుకున్నారు. అయితే మండలంలో కుప్పలుతెప్పలుగా బెల్టుషాపులు ఉన్నప్పటికీ గన్నవరంలోని బెల్టుషాపుపైనే సీఐ మమతారెడ్డి, ఎస్ఐ రత్నప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆకస్మికంగా దాడి చేయడం చర్చనీయాంశమైంది.

పశువులు తరలిస్తున్న వ్యాను పట్టివేత



పోలీసులు పట్టుకున్న పశువుల వ్యాను

అశ్వారావుపేట రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యానును పోలీసులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. ఆంధ్రాలోని అనకాపల్లి ప్రాంతం నుంచి 12 ఆవులు, ఎద్దులను ఎటువంటి అనుమతులు లేకుండా రాష్ట్రంలోని జనగామకు తరలిస్తున్నారు. సమాచారంతో ఎస్‌బీ అధికారులు దాడులు నిర్వహించి వాహనాన్ని పట్టుకున్నారు. అనుమతులు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించి, వాహనాన్ని సీజ్ చేసి పశువులను పాల్వంచలోని గోశాలకు తరలించారు. పశువులను తరలిస్తున్న ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జర్నలిస్టుల గుర్తింపుపై

సీఎం వ్యాఖ్యలు సరైనవే..

» టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంనారాయణ



మాట్లాడుతున్న రాంనారాయణ

వైరా, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నిజమైన జర్నలిస్టులను జర్నలిస్టు సంఘాలు గుర్తించి వారికి గుర్తింపుకార్డులు ఇవ్వడం ద్వారా నిర్ధారించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తమ సంఘం బలపరుస్తుందని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ తెలిపారు. మంగళవారం వైరాలో ఆసంఘం జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన జిల్లా మహాసభల సన్నాహక సమావేశంలో రాంనారాయణ ప్రసంగించారు. విలువలతో కూడిన జర్నలిజం బలపడాలని కోరారు. వైరాలో టీయూడబ్ల్యూజే జిల్లా మహాసభలు నిర్వహించాలని నిర్ణయించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రెండో స్వర్ణ భద్రకవచంపై కదలికేది..!

» దశాబ్ద కాలంలోకి అడుగిడినా ఆ ఊసే లేని వైనం » భక్తులిచ్చిన బంగారం లెక్కలపై కానరాని స్పష్టత



స్వర్ణ భద్రకవచాలతో భద్రాద్రిరామయ్య(ఫైల్)

భద్రాచలం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వార్షిక కల్యాణ మూర్తులకు రెండో స్వర్ణభద్రకవచం ఎప్పుడు సిద్ధం చేస్తారని రామ భక్తులు ఎదురు చూస్తున్నారు. ఎందుకంటే దశాబ్ద కాలంలోకి అడుగిడిన తరుణంలో రెండో స్వర్ణభద్రకవచం తయారీకి చే పట్టిన చర్యలు ఏ స్థాయిలో ఉన్నాయి?, అసలు సిద్ధం చేసే ఆలోచన ఉందా? అనే కోణంలో సర్వత్రా ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. వాస్తవానికి ఆనాడు దేవాదాయ శాఖ కమిషనర్ అనుమతి లేకుండానే భద్రాద్రి రామయ్యకు రెండో స్వర్ణభద్రకవచం సిద్ధం చేసేందుకు బంగారం, నగదు భక్తుల నుంచి సేకరించారు. రెండో భద్రకవచం ప్రకటన చేసి ఈ నెల 16వ తేదీకి తొమ్మిదేళ్ల నిండి దశాబ్దకాలంలోకి అడుగిడింది. ఇదిలా ఉండగా ఆనాడు సేకరించిన బంగారం ఎంత? నగదు ఎంత?, అవి ఎక్కడ ఉన్నాయి.. వాటికి సంబంధించిన లెక్కలపై స్పష్టత ఉందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భద్రకవచ తయారీ విషయమై దేవాదాయ శాఖ కమిషనర్‌కు లేఖ రాశామని గతంలో దేవస్థానం అధికార వర్గాలు పేర్కొన్నాయి. అసలు ఆ లేఖకు కమిషనర్ స్పందించారా లేదా అనే విషయంపై సైతం అధికార వర్గాల నుంచి స్పష్టత లేదు.

భద్రాచలంలో 2016 మార్చి 16న స్వర్ణభద్రకవచానికి పంచగవ్యాభిషేకం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన చినజీయర్‌స్వామి రామయ్యకు రెండో స్వర్ణ భద్రకవచం (అదనపు కవచం) కావాలన్నారు. ఈ క్రమంలో ఆయన ప్రసంగిస్తూ భక్తులు అదనపు భద్ర కవచానికి తమవంతుగా బంగారం, నగదును విరాళంగా అందజేయాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన కేజీ బంగారాన్ని భక్తుల నుంచి సేకరించి రామయ్యకు సమర్పిస్తామని ఆనాడు ప్రకటించారు. దీంతో స్పందించిన భక్తులు అప్పటికప్పుడు 300 గ్రాముల బంగారం, రూ.2 లక్షల నగదును స్వామి వారికి సమర్పించారు. అనంతరం దేవస్థానం అధికారులు ఇందు కోసం ప్రత్యేక సిబ్బందిని సైతం నియమించి భక్తుల నుంచి, దాతల నుంచి విరాళాలను బంగారం, నగదు రూపంలో సేకరించారు. ఈవిధంగా కొద్దికాలం పాటు సేకరించిన అనంతరం నగదు, బంగారం సేకరించే ప్రక్రియను నిలిపివేశారు. అయితే దీని కోసం ఆనాడు ఒక ప్రత్యేక రిజిష్టర్‌ను నిర్వహించారు. ఆ రిజిష్టర్ ఎక్కడ ఉంది అనే దానిపై కూడా స్పష్టత లేదని సమాచారం. ఈ క్రమంలో అసలు మొత్తం ఎంత సేకరించారు, ఎంత నగదు వచ్చింది అనే దానిపై దేవస్థానం అధికారిక ప్రకటన నేటి వరకు చేయలేదు. దీంతో అసలు ఇంతకీ బంగారం, నగదు ఏమైంది!? బ్యాంకులో ఫిక్సిడ్ డిపాజిట్ చేశారా లేదా? బంగారం ఇచ్చిన దాతల వివరాలు పూర్తిస్థాయిలో ఉన్నాయా లేవా అనే ప్రశ్న తెరపైకి వస్తోంది. ఎందుకంటే దేవస్థానం అధికారులు విరాళాలు సేకరించే సమయంలో కమిషనర్ అనుమతి వచ్చాక విరాళాలు అందజేసిన దాతలకు రసీదులు అందిస్తామని అప్పటి వరకు ఎటువంటివి ఇవ్వలేమని పేర్కొన్నట్లు సమాచారం. ఆ తరువాత దీనిపై దేవస్థానం ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు.

రెండో స్వర్ణభద్రకవచం కోసం బంగారం, నగదును గతంలో భక్తుల నుంచి సేకరించారు. 873 గ్రాముల బంగారం, సుమారు రూ.2.70 లక్షల నగదు వచ్చిందని అనధికారికంగా తెలుస్తోంది. ఈ మొత్తం ఇంకా ఎక్కువ ఉండే అవకాశాలు కూడా లేకపోలేదని భక్తుల నుంచి వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. గతంలో దేవాదాయ శాఖ కమిషనర్‌కు లేఖ రాసినా ఎటువంటి అనుమతి రాలేదు. దశాబ్దకాలంలోకి అడుగిడినా ఎటువంటి ఊసే లేకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా దేవస్థానంలో కొత్తగా వచ్చిన ఈవోలకు రెండో స్వర్ణభద్రకవచం విషయమై, అందుకు భక్తుల నుంచి సేకరించిన విరాళాలు, బంగారంపై ఎటువంటి సమాచారం లేకపోవడంతో ఈ విషయంపై అడుగులు ముందుకు పడటం లేదని భక్తులు పేర్కొంటున్నారు. మరి ఇప్పటికైనా భద్రాద్రి దేవస్థానం అధికారులు ఇంతటి ప్రాధాన్యత అంశంపై దృష్టిసారించాలని భక్తులు కోరుతున్నారు.

ఆ వార్డెన్ రూటే సపరేటు..

» సస్పెండైనా మారని తీరు » ఇన్‌చార్జికి బాధ్యతలు అప్పగించని వైనం

మణుగూరు టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మణుగూరు ఎస్సీ బాలుర హాస్టల్ మాజీ వార్డెన్ కాటేపల్లి శ్రీనివాస్‌రావు తీరు వివాదాస్పదంగా మారింది. విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యం వల్ల గత జనవరి 28న శ్రీనివాస్‌రావును ఎస్సీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. అతడి స్థానంలో కణితి రాంబాబుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇటీవల శ్రీనివాస్‌రావును అశ్వారావుపేటకు బదిలీ చేశారు. ఈ క్రమంలో ఎస్సీ హాస్టల్‌కు సంబంధించిన రికార్డులు, తాళాలు, స్టోర్ సంబంధిత వివరాలను శ్రీనివాసరావు ఇప్పటివరకు రాంబాబుకు అప్పగించలేదు. మణుగూరు ఎస్సీ బాలుర హాస్టల్‌ను వీడలేక హాస్టల్ విద్యార్థులను తప్పుదోవ పట్టించి ఆటోలు, ఆర్టీసీ బస్సులో కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లి తనకు అనుకూలంగా చెప్పించడానికి ప్రయత్నించినట్లు తెలిసింది. జిల్లా ఉన్నతాధికారి ఉత్తర్వులను ఖాతరు చేయకుండా బదిలీ చేసిన ప్రాంతానికి వెళ్లకుండా, ఇన్‌చార్జి వార్డెన్‌కు బాధ్యతల్ని అప్పగించకుండా శ్రీనివాస్‌రావు వ్యవహరిస్తున్న తీరు ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇతనికి ప్రభుత్వ సర్వీసు నిబంధనలు వర్తించవా.. అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇంతజరుగుతున్నా ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కలెక్టర్‌కు తెలియపరిచాం..దాసరి అనసూర్య, డీడీ

మణుగూరు ఎస్సీ హాస్టల్ గత వార్డెన్ శ్రీనివాసరావును గత జనవరి నెలలో సస్పెండ్ చేశాం.... ఆ తర్వాత ఉన్నతాధికారుల ఉత్తర్వుల ప్రకారం అశ్వారావుపేటకు ఎస్సీ హాస్టల్‌కు బదిలీ చేశాం. అక్కడ బాధ్యతలు స్వీకరించకుండా వ్యవహరిస్తున్నాడు. అంతే కాకుండా మణుగూరు ఇన్‌చార్జి హాస్టల్ వార్డెన్ రాంబాబుకు బాధ్యతలు ఇవ్వడం లేదు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు తెలియజేశాం. కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

అద్భుత ఫలితాల

సాధనకు కృషి చేయాలి

» పది విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన సింగరేణి సీఎండీ బలరాం

కొత్తగూడెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మీ కృషే మీకు అద్భుతమైన ఫలితాలను ఇస్తుందని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం తెలిపారు. ఎస్ఎస్‌సీ బోర్డు పరీక్షలు ఈ నెల 21వ తేదీ నుంచి ఏప్రిల్ 2 తేదీ వరకు జరగనున్నాయని దీనికి సింగరేణి సీఎండీ పదో తరగతి విద్యార్థులకు మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. బోర్డు పరీక్షలు విజయానికి ఒక సోపానం అని అన్నారు. దానికి మీశాయశక్తుల కృషి చేయాలన్నారు. మీ కృషి మీకు అద్భుతమైన ఫలితాలు ఇస్తుందని అన్నారు. దృష్టి కేంద్రీకరించండి, సానుకూలం ఉండండి.. మిమ్మల్ని మీరు నమ్ముకోని, ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడానికి శాయశక్తుల కృషి చేయాలని కోరారు. కష్టపడే వారికి, విజయం సాధించాలనే పట్టుదలతో ఉండే వారికే అనుకూలంగా ఉంటుందన్నారు. ప్రశాంతంగా ఉండాలని, నమ్మకంగా, మీ ప్రయత్నాలు మీరు పొందవల్సిన విజయంగా మారాలన్నారు. బోర్డు పరీక్షలు మరో సవాలు మాత్రమే.. దానిని ఆత్మవిశ్వాసంతో జయించాలని ఆకాక్షించారు.

గిరిజనుల సమస్యలపై అధికారులు దృష్టిపెట్టాలి

» జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్



గిరిజన ఆశ్రమ పాఠశాలలో వంటగదిని పరిశీలిస్తున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్

అశ్వారావుపేట రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. అశ్వారావుపేట మండలంలో రెండోరోజు మంగళవారం ఆయన పలు గ్రామాల్లో మాజీ మంత్రి జలగం ప్రసాదరావుతో కలిసి పర్యటించారు. కావడిగుండ్ల గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. ఇక్కడే ఇంటర్ కళాశాలను ఏర్పాటు చేయాలని, అందుకు అవరసమైన ఐదు ఎకరాల స్థలాన్ని ఇస్తామని గ్రామస్థులు ముందుకు రావడంతో కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని కోరారు. కొండరెడ్ల గ్రామాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన గ్రామాల్లో చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ చదువుకున్న గిరిజన నిరుద్యోగుల కోసం ప్రత్యేకంగా ఐటీడీఏ ద్వారా జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని, అయినా పెద్దగా ఎవరు వినియోగించుకోవడం లేదన్నారు. మాజీమంత్రి జలగం ప్రసాదరావు మాట్లాడుతూ జలగం ద్వారా గిరిజన ప్రాంతాల్లో నిరంతరం సేవలు అందిస్తున్నామన్నారు. అనంతరం పండువారిగూడెంలో గిరిజన రైతులు నిర్వహిస్తున్న జీవా ప్రాజెక్టు కమిటీ ద్వారా తయారుచేసిన జీవామృతాలను, చిరుధాన్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో కృష్ణగౌడ్, ఐటీడీఏ డీడీ మణెమ్మ, నీటి పారుదలశాఖ ఈఈ సురేశ్‌కుమార్, డీఈఈ కృష్ణ, ఏటీడీవో చంద్రమోహన్, తహసీల్దారు చల్లా ప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

25న భవన నిర్మాణ సంఘం రాష్ట్ర మూడో మహాసభ

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): దేశంలో భవన, ఇతర నిర్మాణాల కార్మికులు తీవ్ర దుర్భర జీవితాలను గడుపుతున్నారని వారి ఆర్థిక, సామాజిక పరిస్థితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టికి తీసుకెళ్లేందుకు టీయూసీఐ పోరాటాలు చేస్తోందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోసు పుల్లయ్య పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మంలో నిర్వహించిన సమావేశంలో భవన నిర్మాణ సంఘం రాష్ట్ర మూడో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 25న మహబూబ్‌నగర్‌లో మహాసభలు నిర్వహిస్తున్నామని ప్రకటించారు. జిల్లా అధ్యక్షులు పేరబొయిన వెంకన్న, లెనిన్, కే శ్రీనివాస్, శీలం లెనిన్ పాల్గొన్నారు.

రూ.36 లక్షల పన్ను వసూళ్లు

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య హెచ్చరికలతో ఏఎంసీ షఫీ ఉల్లాఖాన్ పర్యవేక్షణలో రెవెన్యూ ఉద్యోగుల్లో కదలిక వచ్చింది. మూడు గంటల నిరసన తర్వాత కూడా రికార్డు స్థాయిలో ఆదాయ వసూళ్లు చేశారు. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు రెవిన్యూ ఉద్యోగులు నిరసన తెలిపారు. తర్వాత కేఎంసీ కమిషనర్ ఆర్ఐలతో సమావేశం నిర్వహించారు. ఇంకేముంది సాయంత్రానికి రికార్డుస్థాయిలో రూ.36లక్షలు వచ్చాయి.

ఘనంగా కిండర్ గార్డెన్ గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో మంగళవారం కిండర్ గార్డెన్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా డాక్టర్ గట్టినేని సురేష్, విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. చిన్న పిల్లల భవిష్యత్తును రూపొందించటంలో బాల్య విద్య యెక్క ప్రాముఖ్యతను వివరించారు. చిన్ననాటి విద్య పిల్లల భవిష్యత్తు విజయానికి పునాది అన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు.

'రైతుబంధు' రుణాల పంపిణీ షురూ

ఖమ్మం మార్కెట్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కోల్డ్‌స్టోరేజీలలో మిర్చిని నిల్వ చేసిన రైతులకు 6 నెలల వరకు వడ్డీ లేని 'రైతుబంధు' రుణాలను మంగళవారం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఏఎంసీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు ప్రారంభించారు. రైతుబంధు రుణాల కోసం ప్రభుత్వం ఇటీవల ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రూ.5 కోట్ల నిధులను కేటాయించగా మంగళవారం తొలి విడతలో కొణిజర్ల మండలం నాగిలిగొండ గ్రామానికి చెందిన పి.శ్రీను, పి.చిన్ననారాయణ, పి.సత్యవతి, మరిపెడబంగ్లాకు చెందిన వి. భద్రయ్య, వి.మణిశంకర్ తదితర ఐదుగురు రైతులకు ఒక్కొక్కరికి రూ. రెండు లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోల్డ్‌స్టోరేజీలలో పంట నిల్వ చేసిన రైతులు వడ్డీ లేని రైతుబంధు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ పాలకవర్గ సభ్యులు బోజెడ్ల సత్యనారాయణ, వెనిగండ్ల బాబూరావు, లతీఫ్, మార్కెట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులతో..

తుమ్మల యుగంధర్ చర్చ



అధికారితో మాట్లాడుతున్న తుమ్మల యుగంధర్

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు కార్యాచరణపై కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై సీవరేజ్ బోర్డు అధికారులతో సమావేశమయ్యారు. తాగునీటి ఎద్దడికి హైదరాబాద్‌లో తీసుకుంటున్న ఆధునిక విధానాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

చేవెళ్ల డిక్లరేషన్‌కు కట్టుబడిన కాంగ్రెస్

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అధికారంలోకి వచ్చిన ఎస్సీలకు ప్రయోజనం చేకూరే పనులు చేస్తుందని, చేవెళ్ల డిక్లరేషన్‌కు కట్టుబడిన సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణకు అమోదం తెలిపారని టీపీసీసీ మాజీ కార్యదర్శి వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ మాదిగ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఖమ్మంలో విలేకర్లతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను అమలు చేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణపై కోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే అసెంబ్లీలో ప్రకటించి వెంటనే కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసి వెంటనే నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రికి, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాలేరు పాతకాల్వకు వారబంది సరి కాదు

కూసుమంచి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పాలేరు జలాశయం పరిధిలోని పాతకాల్వకు వారబంది విధానంలో నీరు విడుదల చేయడం సరైంది కాదని సీపీఎం మండల కార్యదర్శి రాజశేఖర్, రైతుసంఘం నాయకులు గంగాధర్, మల్లెల షన్మతిరావు తెలిపారు. బుధవారం కూసుమంచి పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో అధికారులు, మంత్రులు పాలేరు పాతకాల్వకు వారాబందీ ఉండదని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. పంటలు ఎండిపోకుండా కాపాడాలని లేనిపక్షంలో రైతులు తీవ్రంగా నష్టపోతారని అందుకు ప్రజాప్రతినిధులు బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు పార్టీనాయకులు పాల్గొన్నారు.

నేడు కూసుమంచి వారపు సంత బహిరంగ వేలం

కూసుమంచి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కూసుమంచి మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే వారపుసంత బహిరంగ వేలం బుధవారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీవో రామచంద్రరావు తెలిపారు. 2025 ఏప్రిల్-1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఏడాదిపాటు అమలులో ఉంటుందని తెలిపారు. కూసుమంచి గ్రామపంచాయతీ ఆవరణలో తమసమక్షంలో బహిరంగ వేలం నిర్వహించబడుతుందని ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని కోరారు.

షాపింగ్ గదులకు మధ్యాహ్నం 2.30గంటలకు

కూసుమంచి ఎస్‌బీఐ పక్కనగల గ్రామపంచాయతీ షాపింగ్ గదులకు నేడు బుధవారం మధ్యాహ్నం 2.30గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు ఎంపీవో రామచంద్రరావు తెలిపారు. మూడు షాపింగ్ గదులున్నాయని, వాటికి ఏడాదిపాటు దుకాణాలు ఏర్పాటుచేసుకుని నడిపించుకునేందుకు ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

రైతుసంఘం మండల అధ్యక్షుడిగా కనకబండి

నేలకొండపల్లి, మార్చి18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం మండల అధ్యక్షుడిగా కనకబండి సీతారాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం నేలకొండపల్లిలోని కర్నాటి భవన్‌లో జరిగిన తెలంగాణా రాష్ట్ర రైతు సంఘం మండల 3వ మహాసభ జరిగింది. కనకబండి సీతారాములు అధ్యక్షతన జరిగిన మండల మహాసభలో సభానంతరం ఈఎన్నిక జరిగింది. మండల అధ్యక్షుడిగా కనకబండి సీతారాములు, ప్రధాన కార్యదర్శిగా ఫాల్తియా శ్రీనివాస్‌తో పాటుగా 11మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రూ.33 కోట్ల వసూళ్ల లక్ష్యంగా పనిచేయాలి

కమర్షియల్ ప్రాంతాల్లో రాత్రి 9గంటల వరకు కలెక్షన్ చేపట్టాలి

కేఎంసీ రెవెన్యూ అధికారులను ఆదేశించిన కమిషనర్ అభిషేక్ అగస్త్య



సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థకు రావాల్సిన ఆదాయ రాబడిలో ఏ మాత్రం తగ్గేదే లేదని, ప్రతి పైసా నూరుశాతం వసూళ్లు చేయాల్సిందే అని నివాస ప్రాంతాలకు ఉదయం 7గంటలకు, కమర్షియల్ ప్రాంతాల్లో రాత్రి 9గంటలకు ట్యాక్స్ కలెక్షన్‌కు వెళ్లాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. మంగళవారం కేఎంసీలో ఆర్వో శ్రీనివాసరావు, ఆర్ఐలతో కమిషనర్ ఆదాయ వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఖమ్మంనగరంలో 80,348 నివాసాల నుంచి ట్యాక్స్ కలెక్షన్ చేపట్టాలని నిర్ణయించటం జరిగిందన్నారు. రూ.33 కోట్లు ఆదాయ లక్ష్యానికి ఇప్పటి వరకు రూ.25 కోట్లు ఆదాయ వచ్చిందని, మిగిలిన రూ.8 కోట్లు ఈనెల చివరి వరకు వసూళ్లు చేయాల్సిందే అన్నారు. ట్యాక్స్ చెల్లించని వారి భవనాలను సీజ్ చేయాలని కమిషనర్ ఆదేశించారు. వ్యాపారులు పేమెంట్ చేసే సమయంలో బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు ఆదాయ వసూళ్లకు వెళ్లాలని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ అభిషేక్ అగస్త్య హెచ్చరించారు.

వసూళ్లు మా వల్ల కాదు

ఉన్నతాధికారులు నిర్దేశించిన మేరకు ఆదాయ వసూళ్లు చేపట్టటం మా వల్ల కాదని ఖమ్మం నగర పాలక సంస్థలో పనిచేసే వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు నిరసనకు దిగారు. ఖమ్మం నగరంలో 2024-2025 సంవత్సరానికి గాను రూ.32 కోట్లు ఆదాయ వసూళ్ల లక్ష్యంగా కమిషనర్ అభిషేక్ అగస్త్య నిర్ణయించారు. ఆ మేరకు బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లతో పాటుగా వారికి సహాయకులను సైతం కేటాయించారు. తుది గడువు సమీపిస్తుండటంతో ప్రతి బిల్ కలెక్టర్ రోజుకు రూ.1 లక్ష ఆదాయ వసూళ్లు చేయాలని ఆదేశించారు.

అయితే సోమవా రం 8మంది బిల్ కలెక్టర్ల నుంచి రూ.లక్ష ఆదాయ వసూళ్లు జరగలేదు. లక్ష్యం పూర్తి కాని వారి ఒక రోజు వేతనాలను కట్ చేయాలని ఆదేశాలు పంపారు. దీంతో బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు కేఎంసీలో నిరసన తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా నిరసనకారుల వద్దకు వచ్చి మాట్లాడటంతో తిరిగి ఆదాయ వసూళ్లకు బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు వెళ్లారు.

మధ్య గేటు ప్రారంతంలో ఆర్‌యూబీ నిర్మించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

ఖమ్మం గాంధీ చౌక్, మార్చి18(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నడి బొడ్డున కమాన్ బజార్, గాంధీచౌక్ మధ్యలో ఉన్న రైల్వే మధ్య గేట్ ప్రాంతంలో ఆర్‌వోబీ, ఆర్‌యూబీని నిర్మించాలని త్రీ టౌన్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఉండాల క్రిష్ణ, అధ్యక్షుడు సన్నే ఉదయ్ ప్రతాప్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. తొలుత గాంధీచౌక్‌లోని బడ్జెట్ హోటల్ నుంచి వివిధ రాజకీయ, వర్తక, వాణిజ్య ప్రముఖులు ర్యాలీగా వెళ్లి మధ్య గేటు ప్రాంతంలో రైల్వే మూడో నిర్మాణ పనులు పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్ రామారావుని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కన్వీనర్ గుండాల కృష్ణ మాట్లాడుతూ రైల్వే మధ్యగేట్ ద్వారా రోజుకు వేల మంది ప్రయాణిస్తుంటారని అన్నారు. అలాంటి ప్రాంతంలో బ్రిడ్జిని నిర్మించాల్సి ఉండగా ఉన్న రైల్వే గేట్‌ను కూడా మూసి వేస్తారన్న ఆరోపణలు ఉన్నాయని ఆయన అన్నారు. సన్నే ఉదయ్ ప్రతాప్ మాట్లాడుతూ ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం, రైల్వే అధికారులు స్పందించి మధ్య గేటు ప్రాంతంలో ఇక్కడ బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా నాయకులు ఎర్రా శ్రీకాంత్, సీపీఐ త్రీ టౌన్ కార్యదర్శి నూనె శశిధర్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు మాట్లాడారు. ఆర్‌యూబీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నేతలు, సీపీఎం, సీపీఐ, బీజేపీ, టీడీపీ నేతలు, చాంబర్ నేతలు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు



మాట్లాడుతున్న కొండపర్తి

నేలకొండపల్లి, మార్చి18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధానాలను అమలుచేస్తూ దేశీయ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని తెలంగాణా రైతు సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు విమర్శించారు. నేలకొండపల్లిలోని కర్నాటి భవన్‌లో మంగళవారం ప్రారంభమైన తెలంగాణ రైతు సంఘం మండల 3వ మహాసభలో గోవిందరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కనకబండి సీతారాములు అధ్యక్షతన జరిగిన మహాసభలో గోవిందరావు మాట్లాడుతూ నేటి పాలకులు కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్రహిస్తూ, రైతుల సంక్షేమాన్ని విస్మరించటం ఆందోళన కలిగిస్తున్నదన్నారు. దాదాపు 70శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నప్పటికీ పాలకులు మాత్రం వ్యవసాయ రంగాన్ని పట్టించుకోవటం లేదన్నారు. రైతులు తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక, తెచ్చిన అప్పులు తీర్చే దారిలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. వ్యవసాయ రంగం రోజురోజుకూ సంక్షోభంలోకి నెట్టివేయబడుతూ రైతులను దిక్కులేనివారిగా చేస్తున్నదన్నారు. అందరికీ పూర్తిగా రుణమాఫీ చేసామని గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్ సర్కార్ సగం మందికి కూడా రుణమాఫీ కాలేదన్న సంగతిని గుర్తించి, మిగిలిన రైతులకు సైతం రుణమాఫీ చేయాలని, రైతుభరోసా, పెండింగ్‌లో ఉన్న బోనస్ డబ్బు వెంటనే విడుదల చేయాలని గోవిందరావు డిమాండ్ చేసారు. రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహమ్మద్ మౌలానా, రైతుసంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిడికంటి వెంకటరెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్నాటి భానుప్రసాద్, ఉపాధ్యక్షుడు బానోతు రాము, కౌన్సిల్ సభ్యులు చావా గణపతిరావు, మేకల పుల్లయ్య, చిర్రా ప్రసాద్, మారిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు భాగం నర్సింహారావు, నంబూరి నారాయణ, వల్లాల కృష్ణ, బాలెబోయిన వెంకటేశ్వర్లు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ హర్షం



ఖమ్మంలో నిర్వహించిన ప్రదర్శన

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రజల కోరిక మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, జనాభా ప్రాతిపదికన రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయటం హర్షణీయమని ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ 42శాతం అమలు చేస్తూ అసెంబ్లీలో తీర్మాణం అమోదంపై జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబురాలు చేశారు. డీసీసీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి వరకు ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ప్రజాస్వామ్యయుతంగా పనిచేస్తోందన్నారు. బీసీలకు రిజర్వేషన్ పెంపులో కీలకంగా పనిచేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు సాదు రమేశ్‌రెడ్డి, కమర్తపు మురళి, సౌజన్య పాల్గొన్నారు.

కూసుమంచిలో..

కూసుమంచి: బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ అంశాల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును శాసన సభ ఏకగ్రీవంగా ఆమోదించడం పట్ల కూసుమంచిలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బాణాసంచా కాల్చారు. బీసీ కులగణన బిల్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదించడం చారిత్రక విజయమని తెలిపారు.. బడుగు బలహీనవర్గాల పక్షపాతిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా సమగ్ర కుటుంబసర్వేనిర్వహించి బీసీల లెక్క తేల్చారని కొనియాడారు. సాహసోపేతంగా వ్యవహరించిన రేవంత్‌ను అభినందించారు.

చీటింగ్ కేసులో జైలుశిక్ష

ఖమ్మం లీగల్ మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెం మండలం జీకే బంజర్‌కు చెందిన బాణోత్ వీరన్న కు చిట్టీ పేరుతో మోసగించిన కేసులో 7 సంవత్సరాల జైలుశిక్షతోపాటు లక్ష 50వేల రూపాయల జరిమానా విధిస్తూ ఖమ్మం డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి జి.రాజగోపాల్ తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ది.17-11-2017న ఫిర్యాది కె.ఉపేందర్ నిందితుడి దగ్గర ప్రైవేటు చిట్టీని 30నెలల కాలానికి నెలకు 10వేల రూపాయల చొప్పున 29 నెలలు చెల్లించాడు. ఇతనితోపాటు మరో 139 మంది చిటీలు కట్టినారు. వాటి బాపతులో అందరి చిట్టీల విలువ మొత్తం రూ.86కోట్ల 87లక్షల 832 రూపాయలను నిందితుడు తన సొంత ప్రయోజనాలకు వాడుకొని డిపాజిటర్లకు తిరిగి చెల్లించవలసిన మొత్తం చెల్లించకుండా, ఫిర్యాదికి సైతం చిట్టీ మొత్తం వాయిదాలు పూర్తి అయిపోవటంతో ఫిర్యాదికి నిందితుడుని చిట్టీ మొత్తాన్ని చెల్లించమని అడిగితే రేపు మాపు అని ఇవ్వకుండా తిప్పుతున్నాడని, ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రైవేటు చిట్‌ను నడుపుతూ మోసపూరితంగా చిట్ మొత్తాన్ని అక్రమంగా తన అవసరాలకు వాడుకొని మోసగించాడని, ఫిర్యాదు ఖమ్మం రఘునాథపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదుచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలుచేసినారు. కేసును విచారించిన న్యాయాధికారి నిందితుడిపై సెక్షన్ 5 డిపాజిటర్స్ మరియు ఫైనాన్సియల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, చీటింగ్ కింద నేరం రుజువుకావటంతో పై విధంగా శిక్షవిధిస్తూ తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున పీపీ ఎ.శంకర్ కేసు వాదించగా, లైజన్ ఆఫీసర్ కె.శ్రీకాంత్, హోంగార్డు ఎస్.డి.యూసఫ్ సహకరించారు.

'ఇందిరమ్మ' లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సొంతింటి కల నెరవెరబోతోంది. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించింది. తర్వాత వాటిని గ్రామ సభలు నిర్వహించి బహిరంగ ప్రకటనలు చేశారు. ఇప్పుడు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో నిరుపేదలై ఉండి ఇంటి స్థలం ఉండి నిర్మాణానికి సిద్దంగా ఉన్న వారిని ఎల్ 1 కేటగిరిలో గుర్తిస్తోంది. బుధవారం నుంచి ఐదు రోజులు పాటు ఎల్ 1 కేటగిరిలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల మంజూరు జరిగిన వారిని క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలన చేయనున్నారు.

5,754 మంది లబ్దిదారుల గుర్తింపు

ఖమ్మం నగరంలోని 60 డివిజన్‌ల పరిధిలో ఇందిరమ్మ ప్రత్యేక యాప్ ద్వారా గతంలోనే ప్రజాపాలన దరఖాస్తుల మేరకు సర్వే పూర్తి చేశారు. వాటిలో నిరుపేదలై ఉండి ఇంటి స్థలం కలిగిన 5,754 మందిని అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ప్రజాపాలన గ్రామ సభలో అమోదం తెలిపారు. బుధవారం నుంచి ఐదు రోజులు పాటు ఖమ్మం నగరంలోని 5,754 మంది లబ్దిదారులపై మరోసారి అధికారులు పరిశీలన చేయనున్నారు. ఇందుకోసం ఖమ్మం నగరంలోని ప్రతి రెండు డివిజన్‌లకు ఒక జిల్లా అధికారిని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ నియామకం చేశారు. జిల్లా అధికారులకు సహాయకులకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య 60 మంది బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, కార్యాలయం సిబ్బందిని నియామకం చేశారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య పర్యవేక్షణలో ఇందిరమ్మ ఇళ్లకై ఎల్ 1 ఎంపిక జరగనుంది.

25న కేఎంసీ బడ్జెట్ సమావేశం

ప్రకటించిన మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ పాలకవర్గం 2025-2026 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సమావేశాలకు మేయర్ పునుకొల్లు నీరజ నిర్ణయించారు. ఈ నెల 25న ఉదయం 11గంటలకు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశాలు ఏర్పాటు చేసి బడ్జెట్‌కు అమోద ముద్ర వేస్తున్నట్లు మంగళవారం మేయర్ ఒక ప్రకటన లో తెలిపారు. గౌరవ సభ్యులు సకాలంలో హాజరు కావాలని మేయర్ పునుకొల్లు నీరజ కోరారు.

నియంతలా వ్యవహరిస్తున్న వీసీ

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కాకతీయ విశ్వ విద్యాలయం పరిధిలో విద్యాభ్యాసం చేస్తున్న ఉన్నత విద్య విద్యార్థులపై వైస్ చాన్సలర్ నియంతగా వ్యవహరిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, పీడీఎస్‌యూ(జార్జిరెడ్డి) జిల్లా అధ్యక్షుడు మంద సురేష్ ఆరోపించారు. వీసీ తీరును నిరసిస్తూ మంగళవారం ఖమ్మం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడారు. నాయకులు మస్తాన్, శివనాయక్, వంశీ, అజయ్, ఇందు, వర్ష, టీబీ విలాషా పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు పూర్తి

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ స్కూల్, హాస్టల్ లోని విద్యార్థులకు స్పెషల్ డ్రైవ్ ద్వారా కంటి పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళావతిబాయి తెలిపారు. రెండవ విడత కళ్లజోళ్లు నేడో రేపో రానున్నట్లు ఆమె తెలిపారు.

ఐదు అక్రమ కట్టడాల కూల్చివేత

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు పంజా విసిరారు. మంగళవారం ఒకే రోజు రహదారులను అక్రమించి నిర్మాణాలు చేసిన ఐదు నిర్మాణాలను కూల్చి వేశారు. రిక్కాబజార్ నుంచి చర్చి కాంపౌండ్ వరకు రోడ్డును అక్రమించిన నిర్మాణాలను బుధవారం కూల్చీ వేయనున్నారు.

విద్యార్థులు మంచి మార్కులు సాధించాలి

తిరుమలాయపాలెం, మార్చి18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి పేర్కొన్నారు మంగళవారం మండలంలోని సుబ్లేడు ప్రభుత్వ జిల్లా ఉన్నత పాఠశాలలోని పదో తగరతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని తన సొంత ఖర్చులతో అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించి తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలన్నారు. పడమటితండాలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, పెన్నులు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుమన్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, సైదులు, రాజు, నవీన్, అనిల్, సీతారాం, సురేష్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.



శిథిలావస్థలో గ్రంథాలయం

» పట్టించుకోని అధికారులు » నూతన భవనం నిర్మించాలని పాఠకుల వినతి



మదిగొండలోని గ్రంథాలయం

ముదిగొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పది మందికి విజ్ఞానం పెంపొందించేందుకు గతంలో మండలానికి ఒక శాఖా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. తర్వాత వాటి బాగోగులు పట్టించుకోకపోవడంతో అవి ఇప్పుడు శిథిలావస్థకు చేరుకున్నాయి. ముదిగొండలోని గ్రంథాలయం శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందోననే స్థితిలో ఉంది. దీంతో నిత్యం గ్రంథాలయానికి వచ్చే పాఠకులు భయాందోళనలకు గురవుతుండగా, కొంతమంది గ్రంథాలయానికి రావడమే మానేశారు. ఎన్నోసార్లు అధికారులకు గ్రంథాలయ భవనం స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలని పలువురు పాఠకులు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రంథాలయాన్ని 1981లో అరవింద యువజన మండలి ఆధ్వర్యంలో నిర్మించగా, అప్పటి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. కొన్ని సంవత్సరాలుగా ఈ గ్రంథాలయం శిథిలావస్థకు చేరడంతో వర్షం వచ్చినప్పుడు స్లాబ్ నుంచి నీరు కారుతూ పుస్తకాలు తడవడంతో చెదలు వస్తున్నాయి. పై పెచ్చులూడి కింద పడుతుండటంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని కొంతమంది పాఠకులు గ్రంథాలయానికి రావడమే మానేశారు. ఈ గ్రంథాలయానికి అతి సమీపంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉండటంతో నిత్యం విద్యార్థులు గ్రంథాలయానికి వస్తుంటారు. శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చేందుకు జంకుతున్నారు. కొంతమంది పాఠకులు పుస్తకాలను ఇంటికి తీసుకువెళ్లి చదువుకుంటున్నారు. ఇప్పటికైనా డిప్యూటీ సీఎం, స్థానిక ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క అయినా స్పందించి నూతన గ్రంథాలయాన్ని నిర్మించాలని పాఠకులు, విద్యార్థులు కోరుతున్నారు.

నూతన గ్రంథాలయాన్ని నిర్మించాలి

● మెట్టెల సతీష్, ముదిగొండ



మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయాన్ని తొలగించి నూతన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలి. కళాశాల, వివిధ పాఠశాలలు ఉన్నందున విద్యార్థులు గ్రంథాలయానికి వస్తుంటారు. ఇది శిథిలావస్థకు చేరడంతో వర్షం వచ్చిన సమయంలో స్లాబ్ నుంచి నీరు కారుతూ పుస్తకాలు, పత్రికలు తడిసిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి: ఆర్డీవో

ముదిగొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని మాదాపురంలో పంటపొలాలను పరిశీలించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీళ్లు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, పూర్తిస్థాయిలో ఎస్సారెస్పీ కాల్వలు తీయాల్సి ఉందని, కాల్వ ఉన్నంతవరకు నీళ్లు రాకుండా కూసుమంచి మండల రైతులు అడ్డుకట్టలు వేస్తున్నారని మండల రైతులు ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లారు. పంటలకు నీటి ఎద్దడి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామలెవల్ కమిటీ అధికారులకు ఆర్డీవో సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, ఏవో వేణుయాదవ్, ఆర్ఐ వహీదా, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నాగేశ్వరరావు



బోనకల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బోనకల్ గ్రామానికి చెందిన గుగులోతు నాగేశ్వరరావు బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పై నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకుగానూ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని, ప్రధాని అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేస్తానని పేర్కొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

వైరా, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలడుగు హైస్కూల్లో మంగళవారం పదోతరగతి విద్యార్థులకు ఆపాఠశాల పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని అందజేశారు. 13మంది విద్యార్థులకు పూర్వవిద్యార్థులు మోదుగు వినోద్‌కుమార్, కాకాని వాణీ, షేక్.పర్వీన్, కుష్మావతి, ప్రధానోపాధ్యాయుడు ఇమానియేల్ తదితరులు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈనెల 21నుంచి జరిగే పదోతరగతి పరీక్షల్లో మంచిగా రాణించాలని ఆకాంక్షించారు.

లయన్స్‌క్లబ్‌కు అవార్డులు

వైరా, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పలు సేవ కార్యక్రమాలకుగానూ వైరా లయన్స్‌క్లబ్‌కు పది సేవా అవార్డులు లభించాయి. గత ఏడాది జూలై నుంచి ఈ మార్చినెల వరకు రీజియన్ స్థాయిలో వైరా లయన్స్‌క్లబ్ 150కిపైగా సేవ కార్యక్రమాలు నిర్వహించి ఈ అవార్డులను సొంతం చేసుకుంది. సోమవారం రాత్రి ఖమ్మంలో జరిగిన రీజియన్ సమావేశంలో చైర్మన్ డీవీసీ.రావు చేతులమీదుగా ఈ అవార్డులను ప్రధానం చేశారు. రీజియన్ కోఆర్డినేటర్ ఉండ్రు శ్యాంబాబు, వైరా లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పెనుగొండ ఉపేంద్రరావు, ఉండ్రు వరలక్ష్మి, చింతలపూడి వెంకటేశ్వరరావు, మరికంటి రాంగోపాల్, లగడపాటి ప్రభాకర్, చింతోజు నాగేశ్వరరావు, వనమా విశ్వేశ్వరరావు, పెరుమాళ్ల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సింగరేణిని పరిరక్షిద్దాం

సత్తుపల్లిరూరల్, మార్చి18 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులంతా చేయిచేయి కలిపి పనిచేస్తూ సంస్థను పరరక్షిద్దామని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ అన్నారు. మంగళవారం జేవీఆర్ ఓసీలో వీకే ఓసీ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి నుంచి 22వ తేదీ వరకు కొత్తగూడెం హెడ్ ఆఫీస్‌లో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దారా భీమయ్య, భరణి, నరసింహారావు, కాయితం వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, మహేష్, నరేందర్, రాజేష్, బద్దం వెంకటేశ్వర్లు, వినయ్, బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పెనుబల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తాళ్లపెంట గ్రామంలోని కొమ్ముగూడేనికి చెందిన గజ్జల చిన్న నగేష్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. గ్రామస్థులు స్పందించి తమవంతు సాయంగా నగేష్‌కు రూ.18,200ను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కాకా సీతరాములు, పచ్చగుండ్ల ప్రశాంతి, కాకా మాధవరావు, గువ్వల బాలకృష్ణారెడ్డి, బైరెడ్డి పుల్లారెడ్డి, నడిపల్లి నర్సింహారావు, జంగారావు, బాణోతు నాగేశ్వరరావు, పద్మ, కొత్తగుండ్ల నర్సింహారావు, రామారావు, కాటినేని ప్రసాద్, శివ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ముదిగొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ ప్రధాన సెంటర్లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఎంపీడీవో శ్రీధర్ స్వామి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, ప్రయాణీకులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

'లక్ష్యంతో చదవాలి'



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న తహసీల్దార్, ఎంఈవో

ముదిగొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): లక్ష్యం ఉంటే ఏదైనా సాధించవచ్చునని తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ అన్నారు. మంగళవారం మండలంలోని న్యాలక్ష్మీపురంలో టీం హోప్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కేజీబీవీ పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. ముదిగొండ జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ నిర్వాహకులు కందుకూరి రాకేష్ పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంవో రవికుమార్, ఎంఈవో రమణయ్య, ఆర్ఐలు వహీదా, ప్రసన్నకుమార్, హెచ్‌ఎం శాంతికుమారి, కళాశాల ప్రిన్సిపల్ వాసిరెడ్డి శ్రీనివాస్, చెరుకుపల్లి జనార్థన్‌రావు, రమేష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కల్లూరులో....

కల్లూరు, మార్చి18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అశ్రీ ఫౌండేషన్ తరుపున పరీక్షల సామాగ్రి వితరణ చేశారు. మండలంలోని చిన్నకోరుకొండి, చెన్నూరు, పాయాపూరు పాఠశాలల్లో పదవతరగతి చదువుతున్న 150 మంది విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో షర్రాబు వెంకటేశ్వరావు, హెచ్‌ఎంలు చందుసాహెబ్, దంతాల సుధాకర్, పోట్రు మధు, రమణయ్య, కృష్ణారావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గోదాంల పరిశీలన

ఎర్రుపాలెం, మార్చి18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎర్రుపాలెం వ్యవసాయమార్కెట్ సబ్ యార్డును మదిర వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతనచైర్మన్ బండారు నరసింహారావు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా మార్కెట్ సెక్రటరీ కె.చంద్రశేఖర్‌ను సబ్ యార్డులో నిల్వలు, గోదాంల సామర్థ్యం, భౌతిక పరిస్థితి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతరబీ, ఖరీఫ్ సీజన్లలో ఎంతమంది రైతులు గోదాంలును వినియోగించుకున్నారో వాటిపై ప్రభుత్వ ఆదాయ వివరాలను అందించాలని కోరారు. అనంతరం గోదాంల వినియోగం, సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ దినేష్‌కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అవులూరి సత్యనారాయణరెడ్డి, ఎర్రుపాలెం మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డిసుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు యన్నం పిచ్చిరెడ్డి, గూడేటి బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

మిడ్డేమీల్స్ వర్కర్ల ధర్నాను జయప్రదం చేయండి

వైరా, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కలెక్టర్ కార్యాలయం ముందు బుధవారం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని మధ్యాహ్నభోజన వర్కర్ల యూనియన్ నాయకులు కోరారు. ఈ ధర్నాకు సంబంధించి మంగళవారం మధ్యాహ్నభోజన వర్కర్లు ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వరరావుకు ఒక వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ నాయకుడు అనుమోలు రామారావు, కరుణ, భద్రమ్మ, మాధవి పాల్గొన్నారు.

'మక్కలను కొనుగోలు చేయాలి'

బోనకల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మార్క్‌ఫెడ్ ద్వారా మక్కలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి జక్కుల రామారావు డిమాండ్ చేశారు. మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఆనందరావు, పవన్, మాదారయ్య, తిరపయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర పరిశీలన



రైస్‌మిల్లును సందర్శించిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు

తల్లాడ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ద్వితీయ సం వత్సరం విద్యార్థులు విజ్ఞాన యాత్రలో భాగంగా మంగళవారం తల్లాడలో క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. తల్లాడలోని రైస్‌మిల్లులు, జిన్నింగ్‌మిల్లులు, కోల్డ్‌స్టోరేజీలను సందర్శించారు. వీరికి స్థానిక రైస్‌మిల్లు యజమాని నంబూరి మోహన్‌రావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ శ్రవణ్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

» మునిసిపల్ శాఖ వరంగల్ రీజినల్ డైరెక్టర్ సాహిద్ మసూద్



పన్నులపై సమీక్షిస్తున్న సాహిద్ మసూద్

వైరా, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీలో ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు ఈనెల 31వతేదీలోగా నూరుశాతం వసూలు చేయాలని మునిసిపల్ శాఖ వరంగల్ రీజినల్ డైరెక్టర్ సాహిద్ మసూద్ ఆదేశించారు. మంగళవారం వైరా మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ చింతా వేణుతో కలిసి ఇంటిపన్నుల వసూళ్లపై సిబ్బందితో సమీక్షించారు. ఇంటిపన్నుల వసూళ్లలో ఏమైనా ఇబ్బందులుంటే కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. సమన్వయంతో నూరుశాతం పన్నులు వసూలు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్ఐ ప్రదీప్, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీపై విచారణ

పెనుబల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండాలపాడు గ్రామంలో శనివారం రాత్రి ఓ అంగన్‌వాడీ కేంద్రం తాళాలు పగులగొట్టి గుడ్లు, బియ్యం, పప్పులను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ విషయం తెలుసుకున్న కల్లూరు సీడీపీవో నిర్మలాజ్యోతి, లంకపల్లి సర్కిల్ సూపర్‌వైజర్ అనురాధ, కానిస్టేబుళ్లు రాజమౌళి, పాషాలు మంగళవారం అంగన్‌వాడీ కేంద్రంలో విచారణ చేపట్టారు. అంగన్‌వాడీ టీచర్ స్వరూపరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కల్లూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా, మరోకరు తీవ్రంగా గాయపడిన సంఘటన కల్లూరులో తిరువూరు క్రాస్ రోడ్డు వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని విసన్నపేట మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన దుబ్బాక రాజారావు (50), వెంకటేశ్వరరావులు ద్విచక్రవాహనంపై కల్లూరు వైపు నుంచి ముగ్గ వెంకటాపురం గ్రామానికి వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న కంటైనర్ వారిని ఢీకొట్టడంతో రాజారావు అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరరావును మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. ఈ మేరకు మృతుని బంధువు ఇచ్చిన ఫిర్యాదుతో కల్లూరు ఎస్ఐ హరిత కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్‌బియ్యం చోరీ ఘటనలో డీలర్ సస్పెన్షన్

కల్లూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నకోరుకొండి గ్రామంలో ఓ రేషన్ షాపులో 89 క్వింటాళ్ల బియ్యం చోరీ ఘటనపై సదరు షాపు డీలర్ భిక్షంబాబును సస్పెండ్ చేస్తూ మంగళవారం కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్ ఉత్తర్వులను జారీ చేశారు. దీంతో కల్లూరు గోదాము నుంచి చిన్నకోరుకొండిలో గల షాపు నెం-23 లో ఆదివారం సాయంత్రం దిగుమతి అయిన రేషన్ బియ్యాన్ని భద్రత పరచడంలో నిర్లక్ష్యం, బాధ్యత రహితంగా సదరు షాపు డీలర్ వ్యవహరించాడన్న కారణంతో జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ డీలర్‌ను సస్పెన్షన్ చేశారు. కాగా ఉత్తర్వులను తహసీల్దార్ సాంబశివుడు డీలర్‌కు పంపారు.

గంజాయి మత్తులో యువకుడి హల్‌చల్

పెనుబల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తులో ఓ యువకుడు బీభత్సం సృష్టించిన సంఘటన సోమవారం రాత్రి వీఎంబంజర్ బస్టాండ్‌లో చోటుచేసుకుంది. వీఎంబంజర్‌కు చెందిన సాయి అనే యువకుడు గంజాయి మత్తులో బస్టాండ్ ఆవరణలో ఉన్న సైకిల్ స్టాండ్ నడుపుతున్న దివ్యాంగుడైన నిర్వాహకుడిపై దాడికి పాల్పడ్డాడు. అంతేకాకుండా మహిళలు, యువకులపైన విచక్షణరహితంగా దాడికి పాల్పడ్డాడు. నిర్వాహకుడు సమాచారం అందించటంతో పోలీసులు రావడంతో అక్కడి నుంచి జారుకున్నాడు.

బీసీ రిజర్వేషన్ పట్ల కాంగ్రెస్ శ్రేణుల హర్షం



సత్తుపల్లిలో బాణాసంచా కాలుస్తున్న నాయకులు

వైరా, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం వైరాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బొమ్మా మహేష్‌కుమార్, పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పిలుపు మేరకు పట్టణ, మండల కమిటీ అధ్యక్షులు ఏదునూరి సీతరాములు, శీలం వెంకటనర్సిరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ ప్రధాన రహదారిపై క్రాస్‌రోడ్డు వద్ద బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేశారు. నాయకులు సూతకాని జైపాల్, చప్పిడి వెంకటేశ్వరరావు, బోళ్ల గంగారావు, పమ్మి అశోక్, పణితి శ్రీను, వీరంశెట్టి సీతరాములు, చెరుకూరి కిరణ్, మట్టూరి కృష్ణారావు, ధార్నరాజశేఖర్, కోసూరి శ్రీను, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, పణితి సురేష్, పెద్దప్రోలు లక్ష్మయ్య, పల్లపు కొండలు, కంభంపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

మధిరటౌన్‌లో..

మధిరటౌన్, మార్చి18(ఆంధ్రజ్యోతి): బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ అన్నారు. మంగళవారం మధిరలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మిరియాల రమణగుప్త, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హనుమంతరావు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తూమాటి నవీన్‌రెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షులు దుంపా వెంకటేశ్వర రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మునుగోటి వెంకటేశ్వరరావు, గద్దల మాధురి మాజీ సర్పంచ్‌లు చిట్టిబాబు, మధార్, హరిబాబు, కర్నాటి రామారావు నాయకులు నిడమానూరు వంశీ, పారుపల్లి విజయ్, దారా బాలరాజు, పాటిబండ్ల సత్యంబాబు, దేవిశెట్టి రంగారావు, యన్నం కోటేశ్వరరావు, చావలి రామరాజు, బండారు నరసింహారావు, అద్దంకి రవి, మిరియాల కాశీ, జహంగీర్, గొల్లమందల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్‌లో...

సత్తుపల్లిరూరల్, మార్చి18 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ 42శాతం బిల్‌ను ప్రవేశపెట్టడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తంచేస్తూ మంగళవారం సత్తుపల్లిలో భారీ ర్యాలీ తీసి రింగ్‌సెంటర్‌లో బాణాసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోనకల్‌లో...

బోనకల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లును అమోదించి బడు గు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రాధన్యత ఇచ్చినందుకు గానూ ఆత్మ కమిటీ డైరెక్టర్, బీసీ సెల్ మండల నాయకుడు కందుల పాపారావు హర్షం వ్యక్తం చేశారు. ఆళ్లపాడులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బీసీల పై బీజేపీకి నిజంగా ప్రేమ ఉంటే పార్లమెంటులో కూడా బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మార్పీఎస్ దీక్షకు
బీఆర్ఎస్ మద్దతు

తల్లాడ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, వర్గీకరణ తర్వాతనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్లో ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరాహారదీక్షా శిబిరాన్ని మంగళవారం బీఆర్ఎస్ మండల నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. శిబిరాన్ని మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్, జోన్ కన్వీనర్ దగ్గుల శ్రీనివాసరెడ్డి, సొసైటీ డైరెక్టర్ కాంపాటి జమలయ్య, అద్దంకి వెంకటేశ్వర్లు, షేక్. యూసుఫ్ తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు

● వ్యక్తికి గాయాలు

తల్లాడ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజనాపురం వద్ద మంగళవారం అదుపుతప్పి కారు చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న మహిళకు తీవ్రగాయాలయ్యాయి. వైజాగ్ నుంచి వైరా మండలం స్టేజీ పినపాక వస్తున్న కారు మార్గమధ్యలో అంజనాపురం వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో స్టేజీ పినపాకకు చెందిన కె.నాగలక్ష్మి అనే మహిళ తీవ్రంగా గాయపడింది. ఆమెను చికిత్స కోసం కల్లూరు 108వాహనంలో ఖమ్మం తరలించారు.

ఆశాకార్యకర్తల ధర్నా

ఎర్రుపాలెం, మార్చి18(ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాకార్యకర్తలు మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని వైద్యాధికారికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జరగబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రాష్ట్రప్రభుత్వం రూ.18 వేలు వేతనంగా నిర్ణయించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగభద్రత తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. పలు డిమాండ్లను పరిష్కరించాలని ఖమ్మం కలెక్టరేట్ ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగే ధర్నాకు ఆశాకార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సగ్గుర్తి సంజీవరావు, సీపీఎం మండల కార్యదర్శి మద్దాల ప్రభాకరరావు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లిలో...

కారేపల్లి, మార్చి18(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఆశావర్కర్లకు వేతనంగా రూ.18,000చెల్లించేలా నిర్ణయం తీసుకోవాలని కోరుతూ మంగళవారం మండల తహసీల్దార్ సంపత్‌కుమార్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మండల సీఐటీయూ కార్యదర్శి కె.నరేందర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాధ, కల్యాణి, కుమారి, దేవకరుణ, కమిలి తదితరులున్నారు.

వీసీ.సత్యనారాయణకు సతీవియోగం

వైరా, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలడుగు గ్రామంలో విశ్రాంత ఉపాధ్యాయుడు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు వనమా చిన్నసత్యనారాయణ సతీమణి సరస్వతి మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె భౌతికకాయంపై సీపీఎం జెండా కప్పి పూలమాలలు వేసి పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు నివాళులర్పించారు. వనమా చిన్న సత్యనారాయణ కుమారులు శ్రీనివాసరావు, రమేష్‌లకు సానుభూతి తెలిపారు. సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, తాళ్లపల్లి కృష్ణ, మేరుగు సత్యనారాయణ, చింతలచెర్వు కోటేశ్వరరావు, తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్, షేక్.మజీద్ తదితరులు నివాళులర్పించారు.



సరస్వతి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పోతినేని, నున్నా

ఈజీఎస్ మేట్ల ఎంపికపై రగడ



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి చక్రవర్తి

కల్లూరు, మార్చి18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణలో కూలీలకు అనుసంధానంగా విధులు నిర్వర్తించే మేట్ల ఎంపికపై మంగళవారం జరిగిన గ్రామ సభ అధికార పార్టీల నాయకుల ప్రమేయంతో వివాదంగా మారింది. చెన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులకు నిమిత్తం కూలీలకు అనుసంధానం విధులు నిర్వర్తించే విషయమై ఇద్దరు మేట్లను ఎంపికకు స్థానిక గ్రామ పంచాయతీ తరుపున ప్రచారం నిర్వహించి దరఖాస్తులను కోరారు. 38 మంది దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో నిర్ణయించిన ప్రకారం చెన్నూరు పాఠశాలలో ప్రత్యేక అధికారి చక్రవర్తి సమక్షంలో మేట్ల ఎంపికపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సమయంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతో పాటుగా కూలీలు కూడా హాజరయ్యారు. వారికి తోడుగా ఆ గ్రామలో అధికార కాంగ్రెస్ నాయకులు విచ్చేశారు.. ఇక గ్రామ సభ ప్రారంభం అయిన సందర్భంగా మేట్ల ఎంపిక విషయంలో కాంగ్రెస్‌లోనే రెండు వర్గాలుగా ఏర్పడి మేట్ల ఎంపికలో భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అందులో ఒక వర్గం వారు లాటరీ పద్ధతిపై మేట్ల ఎంపిక చేపట్టాలని డిమాండ్ చేయగా, మరో వర్గం వారు రహస్య పద్ధతి, ప్రతిభ ఆధారం ఎంపిక చేయాలని కోరారు. ఇలా మేట్ల ఎంపికలపై కాంగ్రెస్‌లోనే రెండు వర్గాల మధ్య భేదాభిప్రాయాలు వ్యక్తం కావడం వివాదానికి దారితీసింది. గ్రామ సభలో కాంగ్రెస్ నాయకులతో పాటుగా కూలీలు కూడా రెండు వర్గాల వారీగా చీలిపోయినారు. గ్రామ సభలో కాంగ్రెస్ నాయకుల రగడతో ప్రత్యేక అధికారి చక్రవర్తి, కార్యదర్శి ఉపేందర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేక అంతిమంగా గ్రామ సభను వాయిదా వేశారు.